# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 1-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 175 పేజీలు:6 వెల: రూ.1/-


## పార్వతీపురంలో గోడకూలి ఇద్దరు మృతి.. మరో ముగ్గురికి గాయాలు

అమరావతి, మార్చి 31: ఏపీలోని పార్వతీపురం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని కొమరాడ మండలం సరవపాడులో పాత ఇల్లు కూలుస్తుండగా ఒక్కసారిగా గోడ కూలింది . ఈ ఘటనలో శంకరరావు(33), మాణికమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని పార్వతీపురం ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు,రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. ఇల్లును కూలుస్తున్న సమయంలో అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## కొత్త కోవిడ్ లక్షణాలు ఏమిటి, ఎంతకాలం ఉంటాయి ?

న్యూఢిల్లీ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశంలో కోవిడ్–19(ఊాంఎఆ–19) కేసులు క్రమంగా పెరుగుతున్నాయి, మార్చి మొదటి వారంలో రోజువారీ సగటు కేసులు 313 ఉండగా..మూడవ వారంలో రోజువారీ 966కి పెరిగాయి. మహారాష్ట్రగుజరాత్కర్ణాటక,తమిళనాడు,ఢిల్లీ వంటి రాష్ట్రాలు అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి.ఊాంఎఆ–19, ఫ్లూ లక్షణాలు నిజానికి ఒకేవిధంగా ఉంటాయి. ఊాంఎఆ–19 ఉన్న చాలా మంది వ్యక్తులు చాలా తేలికపాటి లక్షణాలను కలిగి ఉంటారు, ఇవి మూడు నుండి ఐదు రోజుల వరకు ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. ఫ్లూ విషయానికి వస్తే, ఈ ఏడాదిలో మూడు నుండి ఐదు వారాల పాటు కొనసాగే దగ్గును చూస్తున్నాం. ఫ్లూ రోగులలో దగ్గును నియంత్రించడానికి కొన్నిసార్లు యాంటీ అలర్జీ మందులు, దగ్గు సిరప్‌లు ఇస్తున్నట్లు చెబుతున్నారు.ప్రస్తుతం చాలా చాలా కోవిడ్ కేసులు తీవ్రంగా లేవు. ఎక్కువగా దగ్గు, ముక్కు కారటం, జ్వరం వంటి ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలా తక్కువ మందికి మాత్రమే ఆసుపత్రి అవసరం అవుతోందంటున్నారు. వృద్ధులు, మధుమేహం, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి లేదా ఊబకాయం ఉన్నవారిపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రికి చెందిన డాక్టర్ అతుల్ గోగియా చెప్పారు.ప్రస్తుతం ఆస్పత్రుల్లో మాత్రమే కోవిడ్ 19 చికిత్సకు జనరిక్ ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ ఔషధం వ్యాధి తీవ్రతను బట్టి, ఆసుపత్రిలో చేరే ప్రమాదం ఉన్నవారికి మాత్రమే ఇవ్వాలి. బీపీ, గుండె సంబంధిత మందులు వాడేవారికి కోవిడ్19 ఔషధాలు డాక్టర్ల సూచన మేరకు తీసుకోవాలంటున్నారు డాక్టర్లు.

## బెంగళూరులో కదిలే కారులో యువతిపై గ్యాంగ్ రేప్

బెంగళూరు మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో నిర్భయ దిశ లాంటి చట్టాలు వచ్చినా కూడా మహిళలపై అత్యాచారాలు అఘాయిత్యాలు అస్సలు తగ్గడం లేదు. ఇంకా రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. బెంగళూరు వంటి ఐటీ సిటీలోనూ పట్టపగలు మిట్టమధ్యాహ్నం అత్యాచారాలు చోటు చేసుకున్నాయి. కామంధులు బరితెగించి మహిళలపై అత్యాచారాలు చేస్తూనే ఉన్నారు.తాజాగా బెంగళూరులో దారుణం జరిగింది. మహిళను బలవంతంగా తీసుకెళ్లి కదిలే కారులోనే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బెంగళూరులో ఓ మహిళ పార్కులో ఉండగా అక్కడ నుంచి ఈడ్చుకెళ్లి కదులుతున్న కారులో నలుగురు వ్యక్తులు గ్యాంగ్ రేప్ నకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.గత వారం మార్చి 25న కోరమంగళలోని నేషనల్ గేమ్స్ విలేజ్ పార్కులో బాధిత బాధిత మహిళ తన స్నేహితుడిని కలుసుకునేందుకు వచ్చిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.వారిద్దరూ అర్ధరాత్రి వరకూ పార్కులోనే ఉండడంతో నిందితుల్లో ఒకరు బాధితులను ప్రశ్నించాడు. అయితే సదురు మహిళ స్నేహితుడు వెళ్లిపోగానే నిందితుడు తన మరో ముగ్గురు స్నేహితులను పిలిచి పార్క్ నుంచి మహిళను తీసుకెళ్లి తమ కారులోకి బలవంతంగా ఎక్కించారు.నలుగురు నిందితులు కారులోనే వేగంగా వెళుతూ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత బాధితురాలిని ఆమె ఇంటి వద్ద దించేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించడంతో మహిళ బెదిరిపోయింది. చివరకు ధైర్యం చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగుచూసింది.

ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్యాంప్ జరగిన తర్వాత నేరుగా ఆస్పత్రికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. కేసును సీరియస్ గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని బెంగళూరు సీనియర్ పోలీస్ అధికారి సీకే బాబా తెలిపారు.

## కుట్రపూరిత రాజకీయాలకు ఒడి కదుతున్న బీజేపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదు

**–మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య.**

సంగారెడ్డి మార్చి 31 (నేటి నిజం ప్రతినిధి) మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య శుక్రవారమునాడు సంగారెడ్డి పట్టణం లో పర్యటించారు. మధ్యాహ్నం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ పై జరుగుతున్న రాజకీయ కక్షసాధింపు చర్యల పై అయన తీవ్రంగా ఖండించారు . కాంగ్రెస్ పార్టీ నాయకులపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అసత్య రాజకీయ చర్యలపై తగిన విధంగా ప్రజలే జవాబు ఇస్తారని అయన తెలిపారు. దేశంలో ప్రజా వ్యతిరేఖ పాలన చేస్తున్న బీజేపీ మోడీ ప్రభుత్వం ప్రతి పక్షాలను అణచివేతకు గురి చేస్తుంది . ప్రజాబివృదికి ప్రజల పక్షంగా గళమెత్తిన రాహుల్ గంధీపై కుట్రపూరిత రాజకీయాలకు ఒడి కదుతున్న బీజేపి ప్రభుత్వనికి తగిన గుణపాఠం తప్పదని అయన హితవు పలికారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, కౌన్సిలర్ జార్జ్, కౌన్సిలర్ సంతోష్ కుమార్, సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నారాయణ , పార్టీ మండల అధ్యక్షులు బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డిలోని రామాలయం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

హైదరాబాద్ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్, కుర్మయ్యగారి నవీన్‌కుమార్, చల్లా వెంకట్రాంరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం ఉదయం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో నూతన ఎమ్మెల్సలీలతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కవిత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. కొత్త ఎమ్మెల్సీలను అభినందించారు.

**నేటి కందం– నేటికి అందం**

కం॥ పాటకు మొగింపు పలుకుచు
జోడల నాగా యి కిడుచు శుభ దాయకమౌ
నూతన ఆర్థిక వర్షము
చేతన గలిగించి మనకు శేముషి నొసగన్!!

(ఏప్రిల్ 1 క్రొత్త ఆర్థిక సంవత్సరం..)

–రాధశ్రీ
సెల్:9494481210



## సమర్థమైన నాయకత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 31: గ్రామంలో సర్పంచ్ నుంచి రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి వరకు సమర్థమైన నాయకత్వం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయకపోతే అభివృద్ధి జరగదని తేల్చిచెప్పారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులను అందించిన సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఏడాదిన్నర పాటు పని చేశాను అని కేటీఆర్ తెలిపారు. గ్రామీణ నేపథ్యం గురించి తనకు చాలా తక్కువ తెలుసు. పల్లెలకు ఏం కావాలి. పల్లెల్లో ఏ అవసరాలు ఉన్నాయో ముఖ్యమంత్రికి బాగా తెలుసు. సర్పంచ్ కంటే ఎక్కువగా కేసీఆర్ ఆలోచిస్తారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన నాయకుడు కాబట్టి.. పల్లెలను అభివృద్ధి చేస్తున్నారు. పల్లెకు, పల్లె ప్రజలకు ఏం కావాలో కేసీఆర్‌కు తెలిసినంతగా దేశంలో ఏ నాయకుడికి తెలియదు. కేసీఆర్ తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఎన్ఐఆర్‌డీలో శిక్షణకు హాజరయ్యారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధులు ఏం విధులు నిర్వహించాలో అధ్యయనం చేశారు. తొలిసారి గెలిచిన ప్రజాప్రతినిధులకు తమ విధులపై పూర్తి అవగాహన ఉండట్లేదు. మన దేశంలో ప్రభుత్వ వ్యవస్థ ఐదు అంచెలుగా ఉంది. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయకపోతే అభివృద్ధి జరగదు. ఎంపీటీసీలు గ్రామాలకు మండలానికి మధ్య సమన్వయకర్తగా ఉండాలి. జడ్పీటీసీలు మండలానికి, జిల్లా పరిషత్‌కు మధ్య సమన్వయకర్తగా ఉండాలి. ఐదంచెల వ్యవస్థలో ఎవరి పాత్ర ఏంటని తెలుసుకోనంత కాలం.. ప్రజాప్రతినిధులైనా, వ్యవస్థ అయినా ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎన్నికల్లో గెలవాలనే ఆరాటంతో అనేక హామీలు ఇస్తాం. ఆ హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. పంచాయతీ సెక్రటరీ పోస్టు ఖాళీ అయితే తక్షణమే భర్తీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అధికారులు రాష్ట్రంలో పని చేస్తున్నారు. తెలంగాణలో గ్రామాలు ఎలా ఉన్నాయి. వారి సొంత రాష్ట్రాల్లో గ్రామాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకోండి. మాటలు మాట్లాడితే సరిపోదు. ప్రజల వద్దకు పాలన తీసుకుపోవాలనే సంకల్పం ఉండాలి. రాష్ట్ర ఏర్పాటుతోనే వికేంద్రీకరణ ఆగలేదు. అంతటితో ఆగకుండా 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చుకున్నాం. 142 మున్సిపాలిటీలు ఉన్నాయి. 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీంతో సూక్ష్మంగా పని చేసేందుకు వీలు కలిగింది. వికేంద్రీకరణ వల్ల వేగంగా పనులు జరుగుతాయి. ఇప్పటి వరకు 79 జాతీయ అవార్డులు గెలుచుకున్నాం. గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ స్త్రీ నిధి సమాఖ్య దేశానికే ఆదర్శం : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, మార్చి 31:తెలంగాణలో స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య అద్భుతంగా పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుఅన్నారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య పదవ సర్వసభ్య సమావేశం హైదరాబాదులోని శిల్పారామంలో జరిగింది.

ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1. 59 లక్షల సంఘాలలోని 5.30 లక్షల సంఘ సభ్యులు స్త్రీ నిధి నుంచి రుణాలు పొందారని తెలిపారు. స్త్రీ నిధి రుణాల నిలువ ప్రస్తుతం రూ. 5,355 కోట్లని,రుణాల నిలువలో 28.20 శాతం వృద్ధి సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.రాజస్థాన్‌లాంటి రాష్ట్రాలు మన స్త్రీ నిధి ని అమలు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రూ. 750 కోట్లు వడ్డీ లేని రుణాలను విడుదల చేసిందని పేర్కొన్నారు.

మహిళలు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని, దీంతో ఖర్చులు తగ్గుతాయని వెల్లడించారు. అంతేకాకుండా చిన్న చిన్న వ్యాపారాలు చేయాలన్నారు. మండల సమాఖ్య కాలపరిమితి మూడు సంవత్సరములకు పెంచాలని అధికారులకు సూచించారు. సభ్యులకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ అంశాన్ని పరిశీలించాలని తెలిపారు.

స్త్రీ నిధి కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు అధికారులు, ఉద్యోగులకు మంత్రి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో సందీప్ కుమార్ సుల్తానియా, మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ, స్త్రీ నిధి రాష్ట్ర అధ్యక్షురాలు ఇందిరా, వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, ఏపీ మాస్ అధ్యక్షులు సీఎస్ రెడ్డి, స్త్రీ నిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి, స్త్రీ నిధి ఉపాధ్యక్షులు రాఘవ దేవి, కోశాధికారి సరస్వతి, మేనేజింగ్ కమిటీ సభ్యులు, డీఆర్డీవోలు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో మహిళా వ్యవసాయ కళాశాల భవనం నిర్మాణపు పనులు ప్రారంభం : మంత్రి గంగుల



కరీంనగర్, మార్చి 31: తెలంగాణలోని బీసీ బిడ్డలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా కరీంనగర్‌లో రూ. 27 కోట్లతో నిర్మిస్తున్న బీసీ మహిళా వ్యవసాయ కళాశాల భవనం పనులను త్వరలో ప్రారంభించనున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్‌లో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ బీఎస్సీ అగ్రికల్చర్ కాలేజీ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి బీసీ వ్యవసాయ మహిళా కళాశాలను కరీంనగర్‌లో ఏర్పాటు చేసామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులను ప్రారంభిస్తామన్నారు. గతంలో ఇక్కడి విద్యార్థులు వ్యవసాయ విద్యా నేర్చుకోవాలంటే ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని పేర్కొన్నారు. ఈ చదువు చదువుకోవాలంటే 25 లక్షల రూపాయలు వెచ్చించాల్సి ఉండేదని అన్నారు.

కరీంనగర్ వ్యవసాయ విద్యాలయం కేవలం మహిళలకు మాత్రమే ప్రవేశాలు ఉంటాయని, ఇందులో 80శాతం బీసీ మహిళలకు, మిగతా 20 శాతం ఇతరులకు కేటాయిస్తామని అన్నారు. కరీంనగర్ వ్యవసాయ కాలేజీలో నోటిఫికేషన్ ఇచ్చిన గంటలోపే సీట్లన్నీ భర్తీ అయ్యాయని వెల్లడించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ పై కాంగ్రెస్, బీజేపీలు విషం చిమ్ముతున్నాయని, వారి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

స్వయం పాలనలో సీఎం కేసీఆర్ తీసుకున్న రైతు సంక్షేమ చర్యలతో సాగు విస్తీర్ణం పెరిగి భూమికి బరువయ్యే పంటలు పండుతున్నాయని అన్నారు. వడగండ్లతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని, రైతులు అధైర్యపడవద్దు అని హామీ ఇచ్చారు.

## ఏప్రిల్ 1 నుండి నుంచి టోల్ బాదుడు షురూ..

### –సగటున 4 నుంచి 4.5 శాతం పెంపుదల

హైదరాబాద్ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు ఎక్స్‌ప్రెస్ వేలపై ప్రయాణం మరింత భారం కానున్నది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్‌ట్యాక్సులు పెంచేందుకు జాతీయ రహదారుల అథారిటీ రంగం సిద్ధం చేసింది. ప్రస్తుత ట్యాక్స్‌పై పెంపుదల సగటున 4 నుంచి 4.5 శాతం వరకు ఉండనుంది. దీంతో సాధారణ ప్రజల రవాణా సాధనమైన బస్సు ప్రయాణం మరింత భారం కానున్నది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలతో ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు టోల్ ఫీజులతో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ప్రజల సగటు జీవనం భారంగా మరనుంది. జాతీయ రహదారుల ఫీజు (డిటర్మినేషన్ ఆఫ్ రేట్స్ అండ్ కలెక్షన్) నిబంధనలు–2008 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఏటా టోల్‌ట్యాక్సుల సవరణ చేపడుతున్నది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం కూడా పెరిగిన టోల్ ట్యాక్స్ శనివారం నుంచి (ఏప్రిల్ 1) అమల్లోకి రానుంది.

### ప్రతి కిలోమీటర్‌పై రూ.3 పెంపు

గతేడాది నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) వివిధ రకాల వాహనాలకు 10–15 శాతం వరకు టోల్‌ట్యాక్స్‌ను పెంచింది. ప్రస్తుతం జాతీయ రహదారులపై ప్రతి కిలోమీటర్‌కు అది రూ. 2.19గా ఉన్నది. తాజాగా మళ్లీ పెంచడంతో ప్రతి కిలోమీటరుకు రెండున్నర నుంచి 3 రూపాయల భారం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఉదాహరణకు ప్రస్తుతం హైదరాబాద్ నుంచి నాగపూర్ వరకు రూ.1000 వరకూ టోల్ ట్యాక్స్ వసూలు చేస్తుండగా, పెంపు తరువాత ఇది రూ.1100–1200 వరకు ఉండే అవకాశముందన్నారు.

రాష్ట్రం పరిధిలో వివిధ మార్గాల్లో జాతీయ రహదారులపై 32 టోల్‌గేట్లు ఉండగా, వాటిపై ప్రస్తుతం రూ.1800 కోట్లకుపైగా టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం గడచిన తొమ్మిదేండ్లలో కేంద్రం టోల్‌చార్జీలను 300 శాతం పెంచడం గమనార్హం. టోల్‌ట్యాక్స్‌లను ఏటా 5 నుంచి 10 శాతం వరకు పెంచుతుండటంతో నిత్యావసర వస్తువుల భారం ఏటేటా పెరుగుతున్నది.

### నెలవారీ పాస్‌లపైనా మోత

నెలవారీ పాసులకు పెంపుదల వర్తించనుంది. వీరికి కనిష్టంగా రూ.155 మొదలుకొని గరిష్టంగా రూ.1295 వరకు పెరుగనుంది. వీటి చార్జీలను ఐదు నుంచి ఆరు శాతం పెంచినట్ల స్పష్టమవుతున్నది. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై గరిష్ట టోల్ చార్జి ఉండే కొర్లపహాడ్ వద్ద నెలవారి పాసులపై అదనపు భారాన్ని పరిశీలిస్తే.. జీపు, వ్యాన్ లాంటి లైట్ మోటార్ వాహనాలకు ప్రస్తుతం రూ.4025 ఉంటే అది రూ. 4225కు పెరిగింది. లైట్ కమర్షియల్ వెహికిల్‌కు రూ.6385 నుంచి రూ.6710కు పెరిగింది. బస్ లేదా ట్రక్‌కు రూ.13240 నుంచి రూ.13910కు, హేవీ వెహికిల్స్‌కు రూ.20,530 నుంచి రూ.21,570వరకు, ఓవర్

## 'సెంట్రల్ విస్తా' ను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నూతన పార్లమెంట్ బిల్డింగ్ 'సెంట్రల్ విస్తా' నిర్మాణ పనులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుది దశలో ఉన్న నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ప్రధాని మోదీ సర్‌ప్రైజ్ విజిట్‌తో అధికారులు ఆశ్చర్యపోయారు. నిర్మాణానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ప్రధాని మోదీ గంటకుపైగా సెంట్రల్ విస్తా ప్రాంతంలో గడిపారని, పలు పనులను తనిఖీ చేశారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఇక ప్రధాని వెంట లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఉన్నారు. ప్రధాని విజిట్‌కు సంబంధించిన ఫొటోల్లో పెద్ద హాల్స్, ఒక లైబ్రరీ, భారీ పార్కింగ్ ప్రదేశం, కమిటీ రూమ్స్ కనిపించాయి. ప్రాంతమంతా కలియదిగిరి ప్రధాని మోదీ నిర్మాణ కార్మికులతో కూడా ముచ్చటించినట్టు ఫొటోల్లో స్పష్టమవుతోంది.

## సిసోడియాకు ఎదురుదెబ్బ.. బెయిల్ నిరాకరించిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు

న్యూఢిల్లీ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కు ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ కేసులో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ ప్రత్యేక కోర్టు శుక్రవారంనాడు నిరాకరించింది. ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగపాల్ ఈనెల 24వ తేదీన సిసిడియా బెయిల్ అభ్యర్థనపై తీర్పును మార్చి 31వ తేదీకి వాయిదా వేశారు. శుక్రవారం తీర్పు వెలువరించారు.నిందితుడి రెగ్యులర్ బెయిల్ అప్లికేషన్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ లిఖిత పూర్వకమైన వివరాలు కోర్టుకు తెలియజేసిందని, కాపీ ప్రతిని నిందితుడి న్యాయవాదికి ఇవ్వడం జరుగుతుందని, కేసు డెయిరీ, సాక్ష్యుల వివరాలకు సంబంధించిన కాపీని కూడా అందుబాటులో ఉంచుతామని ప్రత్యేక న్యాయమూర్తి తెలిపారు.కాగా2021–22 ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలు విషయంలో అవినీతికి ఆరోపణలపై సిసోడియాను ఇంతవరకూ ఏడు రోజుల పాటు సీబీఐ ప్రశ్నించింది. ఫిబ్రవరి 26న అరెస్టు చేసింది. దీంతో తీహార్ జైలుకు వెళ్లిన ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 9న అరెస్టు చేసింది. కాగా, సిసోడియా జ్యుడిషియల్ కస్టడీని ఏప్రిల్ 5వ తేదీ వరకూ ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది. సిసోడియా బెయిల్ అభ్యర్థనను సీబీఐ తిరస్కరిస్తూ వస్తోంది. ఆయనకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను ధ్వంసం చేసే అవకాశం ఉందని, ఈ కేసులో ఆయన తరచూ ఫోన్లు మార్చారని, అదేమీ అమాయకత్వం కాదని తెలిపింది. ఛార్జిషీటు దాఖలు చేయడానికి తమకు 60 రోజుల సమయం ఉందని, అప్పటివరకూ బెయిల్ ఇవ్వవద్దని గత విచారణలో కోర్టుకు సీబీఐ విన్నవించింది.

## నిరుద్యోగులతో కేంద్రం చెలగాటం : నామా నాగేశ్వరరావు

హైదరాబాద్, మార్చి 31: కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతుందని లోక్‌సభ బీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కేంద్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో నామా అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

కేవలం 10 శాఖల్లోనే 10 లక్షల ఉద్యోగాలు ఖాళీలున్నట్లు పేర్కొనగా అన్ని శాఖల్లో ఇంకెన్ని లక్షల ఖాళీలు ఉన్నాయని నామా ప్రశ్నించారు. తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టు(ఖనీబబిఐ)లను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ ఏజెన్సీలు సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో భర్తీచేయాల్సిన పోస్టుల వివరాలను (ఖాళీలను) సంవత్సరాల వారీగా తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

దేశ వ్యాప్తంగా వివిధ శాఖల్లో మార్చి 1, 2021 నాటికి 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ ఖాళీలను కేంద్రం అందజేసిన సమాచారం పూర్తిగా అసంబద్ధంగా ఉందని, గతంలో ఆయా శాఖల్లో 16 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పిన కేంద్రం(అవనిబితీజీశ్రీ) తీరా ఇప్పుడు పది శాఖల్లో దాదాపు 10 లక్షలేనని చెప్పటం కేంద్రం రెండు నాల్కల ధోరణికి నిదర్శమని మండిపడ్డారు.






రచనలకు ఆహ్వానం

కండలు కరిగించె కార్మికులు
చెమటోడ్చి కష్టపడే కర్షకులు
బతుకులను వెల్లబోసే పేదవాళ్ళు
మౌన యంత్రాలై కదిలిపోతున్నా
సమాజం 'శ్రమ'ను గుర్తించటం లేదు.

'శ్రమ'
ఎవరికీ కనిపించని విలువ
ఎవరికీ అర్థంకాని బతుకు

అలాంటి 'శ్రమ'కు గుర్తింపే
శ్రామికుల, కార్మికుల దినోత్సవం
'మేడే'
ఈ సందర్భంగా

"శ్రమ"

అంశంపై వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

ఏప్రిల్ 15లోగా మీ కవితలను పంపగలరు.

నేటి నిజం దినపత్రిక,
ఎస్ఆర్‌టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–500 020.
E-mail : netinijam93@gmail.com

# పంచేంద్రియాల్లో నేత్రాలు ప్రధానం..!

## (01 - 07 ఏప్రిల్ 'అంధత్వ నివారణ వారం' సందర్భంగా)

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. అంధత్వ సమస్య ఎంత బాధాకరమో అనుభవించిన వారికి మాత్రమే తెలుస్తుంది. చూడగలిగే వారికి దృష్టి విలువ అంతగా తెలియదు. ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు పలు రకాల దృష్టి సమస్యలతో సతమతం అవుతూ ఉండగా, వారిలో దాదాపు 40 మిలియన్లకు పైగా ప్రజలు శాశ్వత అంధత్వంతో బాధ పడుతున్నారని, అందులో అత్యధికంగా 10 మిలియన్లకు మించి ఇండియాలోనే అంధత్వ బాధితులు ఉన్నారనే విషయం భారతీయులను కలచి వేస్తున్నది. ఇండియాలో రాజస్థాన్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో అంధుల జనాభా అధికంగా ఉన్నది. అంధత్వ నివారణ పట్ల సామాన్య జనంలో అవగాహన కల్పించడం, వైద్య సదుపాయాలు నెలకొల్పడం, అంధుల విద్యాలయాలు నెలకొల్పడం, హక్కుల పరిరక్షణ, నేత్రదాన ఉద్యమాలు, అంధులకు ఉద్యోగ ఉపాధుల్లో సమాన అవకాశాలు కల్పించడం లాంటి అంశాలను చర్చించే వేదికగా భారత ప్రభుత్వం 01 నుండి 07 ఏప్రిల్ వరకు 'అంధత్వ నివారణ వారం' నిర్వహిస్తున్నది.

### అంధత్వ నివారణ ప్రయత్నాలు:

1960లో జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించిన అంధత్వ నినారణ వారం సందర్భంగా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఉచిత కంటి పరీక్షల శిబిరాలు, ప్రచార సామాగ్రి వినియోగాలు లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. నేత్ర ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించిన ప్రపంచ సమాజం 08 అక్టోబర్‌న 'ప్రపంచ దృష్టి దినం', 07 నుంచి 13 మార్చి వరకు 'ప్రపంచ గ్లకోమా వారం', అక్టోబర్ మాసాన్ని 'అంధత్వ అవగాహన మాసం'గా నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. భారత ప్రభుత్వం అంధుల విద్య కోసం ప్రత్యేక విద్యాలయాలు నెలకొల్పినప్పటికీ మరి కొంత దృష్టి పెట్టడం అవసరం ఉంది. అంధత్వంతో ఇమిడి ఉన్న పలు సమస్యలకు పరిష్కారాలు అన్వేసించే క్రమంలో ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, అంధత్వ సంబంధ విభాగాలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది. నేత్ర సమస్యలను పరిష్కరించడానికి తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, అంధత్వం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరగాలి.

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'కంటి వెలుగు పథకం' :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 18 జనవరి 2024న చేపట్టిన 'కంటి వెలుగు' 2వ విడత పథకం ద్వారా రాష్ట్రం నుంచి. నివారించగల అంధత్వాన్ని (ప్రివెంటబుల్ బ్లైండ్‌నెస్) తరిమే లక్ష్యంతో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా 1,473 పట్టణ వార్డులు, 4,089 గ్రామపంచాయతీల ద్వారా మార్చి 06, 2023 వరకు 66 లక్షల మంది (31 లక్షల పురుషులు, 35 లక్షల స్త్రీలకు నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు, ఔషధాలు, ఇతర సాధారణ చికిత్సలు చేస్తున్నారు. దేశంలోనే తనదైన ప్రత్యేక ప్రజాహిత కార్యక్రమంగా చేపట్టిన 'కంటి వెలుగు' ద్వారా అందరికి ఉచిత కంటి పరీక్షలు (యూనివర్సల్ ఐ స్క్రీనింగ్) నిర్వహించడం, ఉచితంగా కంటి అద్దాలను వితరణ చేయడం, నేత్ర చికిత్సలో భాగంగా ఔషధాలను అందించడం, నేత్ర సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయడం లాంటి ఉచిత సేవలను అందిస్తున్నారు. తొలి విడత 'కంటి వెలుగు పథకం-1' ఆగస్టు 15, 2018న ప్రారంభమై 106 కోట్ల ఖర్చు చేసిన పిదప విజయవంతంగా ముగిసింది. కంటి వెలుగు పథకంలో భాగంగా వక్రీభవన చూపు లోపం, కంటి శుక్లాలు, విటమిన్ ఏ లోపం, కంటి ఇన్ఫెక్షన్లు, గ్రాకోమా, కార్నియల్ డిజార్డర్, డయాబెటిక్ రెటినోపతి జబ్బులకు ఉచిత చికిత్సలు కల్పించడంతో గ్రామీణ/పట్టణ ప్రాంత నిరుపేదలు అధికంగా లాభపడ్డుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో మెడికల్ ఆఫీసర్, 2/3 యంపిహెచ్‌యస్, 1/2 ఆప్టోమెట్రిస్టులు, 2/3 ఆశా వర్కర్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ సిబ్బందితో పాటు నేత్ర పరీక్షలకు కావలసిన వైద్య పరికరాలు, మెటీరియల్స్, ఔషధాలు అందుబాటులో ఉంచారు.

### అంధత్వం వర్గీకరణ - నివారణ చర్యలు:

అంధత్వం మూడు రకాలుగా కనిపిస్తుంది. వీటిలో ట్రకోమా (శుక్లపటలమునకు సోకిన అంటురోగం), కాటరాక్ట్ (కంటి శుక్లాలు), విటమిన్-ఏ పోషకాహారలోప అంధత్వం వస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టిన 'రైట్ టు సైట్ (దృష్టి హక్కు)' నినాదంతో అంధత్వ నివారణ చర్యలు తీసుకుంటున్నది. విటమిన్-ఏ పోషకాహారలోపంతో జనించే అంధత్వం నివారించ తగినదే అని ప్రభుత్వాలు, పౌర సంఘాలు గుర్తించాలి. కంటి ఆరోగ్య పరిరక్షణ, నేత్ర రుగ్మతల చికిత్సలు, దృష్టి దోషం కలిగిన మేధావుల విజయ గాథలు, నేత్ర ఆరోగ్య పరిరక్షణ పరిశోధనలు, స్వచ్ఛంధ సంస్థల బాధ్యతాయుత సేవలు లాంటి అంశాల్లో శ్రద్ధ వహించుటతో అంధత్వ సమస్యను తగ్గించవచ్చు. గాలి కాలుష్యం అతిగా పెరిగితే నయం చేయలేని అంధత్వం కూడా వస్తుందని నేత్ర వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ అంధత్వ నిర్వహణ కార్యక్రమం వివరాల ప్రకారం 62.6 శాతం కాటరాక్ట్, 19.70 శాతం రిఫ్రాక్టివ్ ఎర్రర్, 0.90 శాతం కార్నియల్ బ్లైండ్‌నెస్, 0.90 శాతం పిసిఓ, 4.70 శాతం పియస్‌డి మరియు 4.19 శాతం ఇతర కంటి సమస్యలతో బాధ పడుతున్నారు. ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 0.80 మంది కంటి సమస్యలను కలిగి ఉన్నారని అంచనా. గ్లకోమా, కంటి శుక్లాలు, కండ్ల కలకలకు వైద్యం సకాలంలో అందితే అంధత్వం నివారించబడుతుంది.

### దృష్టి పరిరక్షణకు ముందు జాగ్రత్తలు:

కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ చూసే సమయాలను తగ్గించడం, తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, కంప్యూటర్ పనిలో ప్రతి 2 గంటలకు ఒకసారి విరామం తీసుకోవడం, వైద్యుల సలహాలతో నీలికాంతి నుంచి రక్షణ అద్దాలను వాడడం, నిత్యం విటమిన్-ఏ కలిగిన పోషకాహారాన్ని తీసుకోవడం లాంటి జాగ్రత్తలను తీసుకోవాలి. అంధత్వ సమస్యల్లో 80 శాతం నివారించదగినవే ఉన్నాయి. వయస్సు 50 ఏండ్లు దాటిన వారిలో దృష్టి సమస్యలు అధికంగా కనిపిస్తాయి. నేత్ర గాయాలు, దృష్టి దోషాలను నివారించడం, నయం చేయడం మరియు చికిత్సలు అందుబాటులో ఉంచడం ముఖ్యమని గమనించాలి. భారత్‌లో నివారించదగిన పోషకాహార లోప, ట్రాకోమా, కాటరాక్ట్ నేత్ర సమస్యలు అధికంగా కనిపిస్తాయి.

### నేత్రదాన ప్రతిజ్ఞ:

మరణానంతరం నేత్రదానం చేస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ తీసుకోవాలి. మన రెండు నేత్రాల దానంతో మరో ఇద్దరు అంధులకు చూపు లభిస్తుందని, మరణానంతరం కూడా మన కళ్ళు సజీవంగా ఉండగలవనే సద్భావన కలిగి ఉందాం. అంధత్వ నివారణ యజ్ఞంలో పాలుపంచుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ప్రధానమంత్రికి ఫస్ట్ మర్చంట్ నేవీ ఫ్లాగ్‌ను ధరింపజేయడం ద్వారా ప్రారంభమైన వారం రోజుల జాతీయ మారిటైం ఉత్సవాలు



న్యూఢిల్లీ, మార్చి 31:ఏప్రిల్ 5 నుండి వారం రోజుల పాటు జరిగే జాతీయ సముద్ర వేడుకలకు సన్నద్ధమవుతున్నందున, ఫస్ట్ మర్చంట్ నేవీ ఫ్లాగ్'ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధరించిన కోట్ పై కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ పిన్ చేశారు. ఈరోజు న్యూ ఢిల్లీలో పోర్ట్స్, షిప్పింగ్, వాటర్‌వేస్ (ఎంఓపిఎస్‌డబ్ల్యూ) మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో ప్రధానికి జ్ఞాపికను కూడా అందించారు.30.03.2023 నుండి 05.04. 2023 వరకు జాతీయ సముద్ర వారోత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రభుత్వం జరుపుకుంటున్న రోజు ప్రాముఖ్యతను గుర్తించడానికి నావికుల సేవలకు నివాళులర్పించడం జరుగుతుంది. మొదటి ఇండియన్ స్టీమ్‌షిప్ ముంబై కి చెందిన సింధియా స్టీమ్, నావిగేషన్ కంపెనీ మొదటి సారిగా అంతర్జాతీయ సముద్ర జలాలలోకి తన తొలి షిప్ ని 1919 లో ఇదే సమయంలో విడుదల చేసింది "ఎస్ ఎస్ లాయల్టీ" ముంబై నుండి లండన్ కి తన తొలి సముద్రయానంలో అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించింది. అదే రోజున "జాతీయ సముద్ర తీర దినోత్సవం"గా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, భారతదేశానికి చెందిన నావికులు గ్లోబల్ సప్లై చైన్‌ని ఆపరేట్ చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ జాతీయ సముద్ర వారోత్సవాలలో బయట ప్రపంచానికి తెలియని మన సముద్ర యాన వీరులు ఈ సందర్భంగా తమ సేవలను గుర్తు చేసుకుంటారని తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ వారం రోజుల వేడుకల ప్రారంభానికి గుర్తుగా దేశంలోని మొట్టమొదటి మర్చంట్ నేవీ జెండాను ధరించి ఈ ప్రయత్నానికి మద్దతు ఇవ్వడం తమకు ఆనందం కలిగిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఎంఓపిఎస్‌డబ్ల్యూ నావికుల సేవలను, దానితో అనుసంధానించబడిన ఇతర వ్యక్తుల సేవలను గుర్తిస్తుంది. సముద్ర రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు అవార్డులను అందిస్తోంది:

1. సాగర్ సమ్మాన్ వరుణ అవార్డు: భారతీయ షిప్పింగ్ మరియు/లేదా అనుబంధ మారిటైమ్ పరిశ్రమలకు వారి నిరంతర, అత్యుత్తమ సహకారం కోసం వ్యక్తులను గుర్తించి గౌరవించడం కోసం వరుణ అవార్డు.

2. సాగర్ సమ్మాన్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్: షిప్పింగ్ బిజినెస్, కమర్షియల్ ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ రంగాలలో ఇండియన్ షిప్పింగ్ లేదా ఇండియన్ మారిటైమ్ ఇండస్ట్రీస్‌లో సీనియర్ ఫంక్షనల్ స్థాయిలో వారి జీవితకాల అసాధారణమైన, విశిష్ట విజయాలు లేదా పనితీరు కోసం వ్యక్తులను గుర్తించి గౌరవించడం.

3. గ్యాలెంట్రీ సాగర్ సమ్మాన్ అవార్డు: భారతదేశంలో లేదా మర్చంట్ నేవీలో మర్చంట్ నేవీలో వారి శ్రేష్ఠమైన శౌర్య చర్యలకు గుర్తింపుగా భారతీయ నావికులకు (అధికారులతో సహా) గ్యాలంట్రీ ఎట్ సీ అవార్డు.

4. భారత నౌకాశ్రయ శిక్షణ సంస్థ, అత్యుత్తమ భారతీయ షిప్పింగ్ కంపెనీ, అత్యుత్తమ భారతీయ నౌకాదళం, అత్యుత్తమ విదేశీ ఉద్యోగి నావికుడు, అత్యుత్తమ భారతీయ నౌకాశ్రయం, అత్యుత్తమ భారతీయ టెర్మినల్‌ను గుర్తించి, గౌరవించడం.

జాతీయ సముద్ర దినోత్సవం సందర్భంగా, 1వ మరియు 2వ ప్రపంచ యుద్ధాలలో సముద్రంలో తమ ప్రాణాలను అర్పించిన నావికుల స్మారక చిహ్నాలకు ప్రభుత్వం నివాళులు అర్పిస్తోంది. వారి శౌర్యాన్ని, త్యాగాన్ని దేశానికి విస్తృతంగా గుర్తుచేస్తుంది. జాతీయ సముద్ర దినోత్సవ వేడుకల కమిటీని ఏర్పాటు చేశారు. నేషనల్ మారిటైమ్ డే/ మర్చంట్ నేవీ ఫ్లాగ్ డే వేడుకల కోసం వివిధ కార్యక్రమాల నిర్వహణ, సమన్వయం కోసం ముంబైలో కమిటీని ఏర్పాటు చేసారు. నేషనల్ మారిటైమ్ డే సెలబ్రేషన్స్ కమిటీ వ్యవహారాలను సెంట్రల్ కమిటీ నిర్వహిస్తుంది.

కమిటీ ఓడ యజమానులు, నౌకర్లు, పోర్ట్ ట్రస్ట్‌లు, సముద్ర తీరం ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ మొదలైన వారి ప్రతినిధులతో కూడి ఉంటుంది.

# ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఇండియన్ నేవీ కోసం రూ. 1,700 కోట్ల విలువైన 13 లింక్స్-యు2 ఫైర్ కంట్రోల్ సిస్టమ్స్

న్యూఢిల్లీ, మార్చి 31: భారత నావికాదళం కోసం 13 లింక్స్-యు2 ఫైర్ కంట్రోల్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేయడానికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరుతో ఒప్పందంపై సంతకం చేసింది. లింక్స్-జ2 సిస్టమ్ అనేది నావల్ గన్ ఫైర్ కంట్రోల్ సిస్టమ్ దేశీయంగా రూపొందించబడింది మరియు అభివృద్ధి చేయబడింది. ఇది సముద్ర అయోమయ అలాగే గాలి/ఉపరితల లక్ష్యాలను ఖచ్చితంగా ట్రాక్ చేయగలదు మరియు చేదించగలదు. గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ ఉ ఇంజనీర్స్ మరియు గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో దేశీయంగా నిర్మించబడే న్యూ జనరేషన్ ఆఫ్‌షోర్ పెట్రోల్ వెస్సెల్స్‌లో 4వ తరం కి చెందిన పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం తో అభివృద్ధి చేయబడిన మరియు తయారు చేయబడిన వ్యవస్థలు అమర్చబడతాయి. ఈ చర్య నాలుగు సంవత్సరాల వ్యవధిలో రెండు లక్షల పనిదినాల ఉపాధిని సృష్టిస్తుంది మరియు ఎం ఎస్ ఎమ్ ఈ లతో సహా వివిధ భారతీయ పరిశ్రమల క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది, తద్వారా రక్షణలో 'ఆత్మనిర్భర్త' సాధించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు గణనీయంగా దోహదపడుతుంది.

# రైతులకు సాయం చేయడంలోనూ కులకోణం ఏమిటి?

## - నిప్పులు చెరిగిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

అమరావతి మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): రాష్ట్రంలో 3 వేల మంది కౌలురైతులు ఆత్మహత్యకు పాల్పడ్డా.. జగన్ ప్రభుత్వంలో స్పందన లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సాయం చేయడం లోనూ కులకోణం ఏమిటి? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఏపీలో 80 శాతం వరి పంట కౌలు రైతుల సేద్యం నుంచి వస్తున్నదే అని పవన్ అన్నారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీతో పవన్ సమావేశమయ్యారు. కౌలు రైతుల స్థితిగతులపై పవన్‌కు ప్రతినిధులు నివేదిక అందచేశారు. రైతాంగ కష్టాలపై త్వరలో జనసేన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తోందని, రైతు సమస్యలపై జనసేన పోరాడుతోందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇటీవల చనిపోయిన బిడ్డను తరలించేందుకు అంబులెన్స్ అడిగితే ఇవ్వని పాషాణ ప్రభుత్వమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఆస్పత్రులను మెరుగుపరచని వైసీపీ పెద్దలు, విశాఖను రాజధానిగా అభివృద్ధి చేసేస్తారట అని పవన్ విమర్శించారు. బిడ్డ మృతదేహంతో 120 కిలోమీటర్ల దూరం మోటార్ సైకిల్‌పై వెళ్లిన ఆ గిరిజన దంపతులకు సీఎం జగన్ క్షమాపణలు చెప్పాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్‌లో గిరిజనులకు సాయపడేందుకు ఎస్టీ సెల్ ఉన్నా, ఆసుపత్రిలో ఉన్నతాధికారులు ఉన్నా పట్టించుకోకపోవడం అమానవీయమని పవన్ అన్నారు.ఆస్పత్రుల నిర్వహణ, ప్రజారోగ్యంపై పాలకులు ఎంత శ్రద్ధ చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. ఈ తరహా ఘటన మన రాష్ట్రంలో మొదటిది కాదని, కొద్ది నెలల కిందటే తిరుపతి రుయా ఆసుపత్రి నుంచి బిడ్డ మృతదేహాన్ని తరలించేందుకు ఓ తండ్రి వద్ద ఆవేదనను రాష్ట్ర ప్రజలు మరచిపోలేదన్నారు. మచిలీపట్నం సముద్ర తీరంలో ఓ బాలుడు చనిపోతే ఆ బిడ్డ మృతదేహాన్ని బంధువులు బైక్ మీద తీసుకువెళ్లారని, ఆసుపత్రుల్లో ఉన్న మహాప్రస్థానం వాహనాల పథకం ఏమైంది? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

# రోడ్డున పడ్డ చల్లా కుటుంబ విబేధాలు..పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు..



అమరావతి, మార్చి 31:నంద్యాల జిల్లా అవుకు మండలంలోనీ దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి నివాసం రణరంగంను తలపించింది. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి భార్య జడ్పిటిసి శ్రీలక్ష్మిపై చల్లా రామకృష్ణారెడ్డి సోదరులు దాడి చేసినట్లు బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై చల్ల సోదరులతో పాటు మేనల్లుడు దుగ్గిరెడ్డి ,రవీందర్ రెడ్డి వారి కుటుంబీకులు దాడి చేసినట్లు శ్రీలక్ష్మి ఫిర్యాదు చేయడం గమనార్హం.

# సిలిగురిలో ఏర్పాటు చేసిన రెండవ పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశానికి హాజరుకానున్న 130 మంది ప్రతినిధులు

న్యూఢిల్లీ, మార్చి 31:సిలిగురిలో నిర్వహిస్తున్న రెండవ పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశానికి సంబంధించిన వివరాలను వెల్లడించడానికిగాను జి 20 ఇండియా ప్రధాన సమన్వయకర్త శ్రీ హర్ష వర్ధన్ షింగ్లా, పర్యాటక శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ కలిసి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన జి20 ప్రధాన సమన్వయకర్త శ్రీ హర్ష వర్ధన్ షింగ్లా జి 20 పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశ ప్రాధాన్యతను వివరించారు. దీనిద్వారా పర్యాటకప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ సమావేశ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం గురించి కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ వివరించారు.

హిమాలయ పర్వత పాదాల చెంతన వున్న ప్రముఖ్య పర్యాటక కేంద్రం డార్జిలింగ్. సిలిగురితోపాటు ఈ రెండు ప్రాంతాలను రెండవ పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చే ప్రదేశాలుగా ఎంపిక చేసుకోవడం జరిగింది. ఈ సమావేశం ఏప్రిల్ 1నుంచి 3వరకు నిర్వహిస్తారు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సహాయ సహకారాలతో కేంద్ర పర్యాటకశాఖ ఈ రెండవ పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి జి 20 సభ్యదేశాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామిసంస్థల భాగస్వాములు, రాష్ట్ర పర్యాటక, స్థానిక పర్యాటక రంగానికి చెందినవారు దీనిలో పాల్గొంటున్నారు.

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, కేంద్ర మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ జాన్ బార్లా ఈ సమావేశంలో పాల్గొంటున్నారు.

డార్జిలింగ్ అనగానే మనందరికీ గుర్తుకొచ్చేది డార్జిలింగ్ టీ. ఇది 2004లో మొదటి జిఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తి. తేనీరు సేవనంతోపాటు రాత్రిపూట చంద్రుని వెలుగుల్లో తేయాకుల సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుర్సియాంగ్ లోని మకాయ్ బారి టీ ఎస్టేట్ లో ఈ కార్యక్రమం వుంటుంది.

డార్జిలింగ్ లోని డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే ( డిహెచ్ ఆర్) కు 1999 సంవత్సరం డిసెంబర్ 5న యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడ ప్రతినిధులకు టాయ్ ట్రెయిన్ రైడ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోనే అత్యంత ఎత్తులో వున్న రైల్వే స్టేషన్ గుమ్ లో ఈ కార్యక్రమం వుంటుంది. బతాసియాలూప్ నుంచి డార్జిలింగ్ స్టేషన్ దాకా ప్రయాణ కార్యక్రమం వుంటుంది.

పశ్చిమ బెంగాల్ గవర్నర్ వేసవి విడిదిగా పేరొందిన డార్జిలింగ్ రాజ్ భవన్ లో విందు సమావేశం నిర్వహిస్తారు.

ఈ సమావేశానికి హాజరవుతున్న ప్రతినిధులకోసం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బాల్ పాటలు, గిరిజన నృత్యాలు, సంప్రదాయా తప్పా నృత్యం, తమాంగ్ జానపద నృత్యం, చాహు నృత్యం, భారత సైనికుల పైప్ బ్యాండ్ మొదలైన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి.

ఆయుష్ మంత్రిత్వశాఖ సమన్వయంతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

స్థానిక కళల్ని, కళారంగ ఉత్పత్తుల్ని ఈ సమావేశ ప్రతినిధులకు పరిచయం చేయడం జరుగుతుంది. కేంద్ర పర్యాటకశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా షాపులు నెలకొల్పుతారు. ప్రతినిదులు స్వయంగా పాల్గొని ఆయా కళాఖండాల తయారీ అనుభవాన్ని పొందుతారు. దీనికోనం డూ ఇట్ యువర్ సెల్ఫ్..మీకై మీరు తయారు చేయండి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డార్జిలింగ్ లోని హిమాలయా పర్వతారోహణ కేంద్రం తమ సామగ్రిని ప్రదర్శిస్తుంది.

ఈ సమావేశానికి వస్తున్నప్రతినిధులకు ఓడిఓపి జాబితానుంచి ఎంపిక చేసిన జ్ఞాపికలను అందించడం జరుగుతుంది. ఇందులో బుర్ద్వాన్ జిల్లాకు చెందిన వుడన్ పూల్, బంకూరా జిల్లాకు చెంది దోక్రా జిఐ హక్కు ఫిష్, మాల్డా జిల్లాకు చెందిన బంగ్లాశ్రీ సిల్క్ ప్యాకెట్ స్క్వేర్ మొదలైనవి వున్నాయి.

ఈ మధ్యకాలంలో సాహసోపేత కార్యక్రమాలకు సంబంధించిన పర్యాటక విభాగానికి ఇంటా బైటా ఆదరణ లభిస్తోంది. దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ పర్యాటకులు ఆకర్షితులవుతున్నారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించి కేంద్ర పర్యాటకశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీన్ని సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా దీన్ని రూపొందించారు. ఈ రంగానికి సంబంధించిన పలువురు నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అడ్వెంచర్ టూరిజంకు సంబంధించిన అంతర్జాతీయ, దేశీయ అభిప్రాయాలను వెల్లడిస్తారు.

జి20కి భారతదేశం అధ్యక్షస్థానం లో వుంది. దీనిపైన ప్రజలకు అవగాహన కల్పించడానికిగాను ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఏప్రిల్ 3నుంచి 5వరకు వుంటుంది. అడ్వెంచర్ టూరిజం కింద సుస్థిర అభివృద్ధి విధానాలను వివరిస్తారు. సిలిగురినుంచి ఏప్రిల్ 2న హిమాలయన్ డ్రైవ్ కార్ ర్యాలీని నిర్వహిస్తున్నారు.

గుజరాత్ లోని రాన్ ఆఫ్ కచ్ లో ఈ ఏడాది ఫిబ్రవరి 7నుంచి 9వరకూ టూరిజం వర్కింగ్ గ్రూప్ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పర్యావరణ హిత పర్యాటకం, డిజిటలీకరణ, నైపుణ్యాలు, పర్యాటకరంగ ఎంఎస్ ఎం ఈలు, పర్యాటక కేంద్ర నిర్వహణ మొదలైన ఐదు అంశాలను చర్చించారు. వాటికి జి20 సభ్యదేశాల ప్రతినిధులు సంఘీభావం పలికారు. రెండవ పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఐదు ప్రాధాన్యత అంశాలపైన చర్చలుంటాయి. విస్తృతంగా చర్చిస్తారు. తద్వారా పర్యాటక వర్కింగ్ గ్రూప్ అవుట్ కమ్ డాక్యుమెంటును రూపొందిస్తారు. పర్యాటక రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన రోడ్డుమ్యాపును కార్యాచరణ విధానాన్ని తయారు చేస్తారు. ఈ సమావేశాల్లో ట్రావెల్ ఫర్ లైఫ్ కార్యక్రమాన్ని పరిచయం చేస్తారు. మానవత కేంద్ర ప్రపంచీకరణ సాధనకోసం గౌరవనీయులైన ప్రధాని దార్శనికత ప్రకారం ఈ రంగంలో నూతన విధానాలకోసం పర్యాటక వర్కింగ్ గ్రూప్ పని చేస్తోంది.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోన్న ప్రభుత్వం.. సీఎల్పీ నేత భట్టి



ఆదిలాబాద్, మార్చి 31:విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని సీఎల్పీనేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. శుక్రవారం బెల్లంపల్లి పాదయాత్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సమస్యలపై వినతి అందజేయడంతో విద్యార్థులతో ముచ్చటించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపారని, రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.

ఈ సమస్యపై విద్యాశాఖ కార్యదర్శితో మాట్లాడుతానని, అవసరమైతే సీఎస్ దృష్టికి తీసుకెళ్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

భట్టి వెంట డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, మంచిర్యాల జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఆదర్శ వర్ధన్ రాజు, నియోజకవర్గ నాయకులు శంకర్, నాతరి స్వామి, ఉడిమడుగుల మహేందర్, వేముల కృష్ణ, శారద, కంకటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దొంగల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# కవలలకు కేసీఆర్ కిట్ అందించిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



వరంగల్, మార్చి 31:తిమ్మంపేట గ్రామానికి చెందిన బొంత సారయ్య-కొమరమ్మలకు "లలిత-రమ" అనే ఇద్దరు కవల పిల్లలకు గత ఏడాది క్రితం ఒకే వేదికగా వివాహం జరిగి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే లబ్ది పొందిన కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ఒకేసారి చెక్కులను ఇరువురి కవలలకు అందజేశారు. నిన్నటి రోజున నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ ఇద్దరి కవలలు ఒకేరోజు ప్రసవించి మగ పిల్లలకు జన్మనిచ్చారు. ఈరోజు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి, కేసీఆర్ కిట్ ను ఇరువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు గ్రామ సర్పంచ్ మోడెం సాగర్, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలపై ఏర్పాటైన జీ-20 వర్కింగ్ గ్రూప్ 2వ సమావేశంలో భాగంగా సామర్థ్య నిర్మాణంపై వర్క్ షాప్ నిర్వహణ

న్యూఢిల్లీ, మార్చి 31:భారతదేశం అధ్యక్షతన జీ-20 లో మౌలిక సదుపాయాలపై ఏర్పాటైన వర్కింగ్ గ్రూప్ 2వ సమావేశం 2023 మార్చి 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగింది. మౌలిక సదుపాయాల రంగానికి సంబంధించి రూపొందిన కార్యాచరణ ప్రణాళికలో పొందుపరిచిన భవిష్యత్తు నగరాల అభివృద్ధికి నిధుల సమీకరణ అంశంతో పాటు వివిధ అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి.

వర్కింగ్ గ్రూప్ సమావేశంలో భాగంగా సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల కోసం 2023 మార్చి 30న సామర్థ్య నిర్మాణం అంశంపై భారతదేశం, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరిగింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిధుల సమీకరణ అంశంపై చర్చించడానికి వర్క్ షాప్ నిర్వహించారు. సమగ్ర, సంపూర్ణ, సుస్థిర అభివృద్ధి సాధించడానికి మౌలిక సదుపాయాలను కల్పించడానికి స్థానిక సంస్థలకు అవసరమయ్యే నిధులపై వర్క్ షాప్ లో చర్చలు జరిగాయి. సమగ్ర అవగాహన కోసం రెండు విభాగాలుగా వర్క్ షాప్ ను విభజించి నిర్వహించారు. ప్రతినిధులు క్లాస్‌రూమ్ తరగతుల్లో పాల్గొని క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న పథకాలను సందర్శించారు. వివిధ ఆర్థిక పథకాల సహకారంతో వినూత్న విధానాలతో అమలు జరుగుతున్న పథకాలను ప్రతినిధులు పరిశీలించారు.

వర్క్ షాప్ మొదటి భాగంలో సింగపూర్, దక్షిణ కొరియా, రష్యా, చైనా, యూరోపియన్ కమిషన్ భారతదేశానికి చెందిన నిపుణులు తమ దేశాల్లో నగరాలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులు పెంపొందించడానికి అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు.

సమగ్ర, సంపూర్ణ, సుస్థిర నగరాల అభివృద్ధికి సింగపూర్ అమలు చేస్తున్న విధానాలు, వ్యూహాలను సింగపూర్‌లోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఏజెన్సీ మాజీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ జనరల్ అహ్ తువాన్ లోహ్ వివరించారు. ప్రజలు జీవించడానికి అనువుగా ఉండే విధంగా అభివృద్ధి, వ్యర్థాలు, నీటి నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, విద్య. అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర పట్టణ పరిపాలన విధానం సింగపూర్ లో అమలు జరుగుతుందని అన్నారు. అనంతరం పట్టణ ప్రాంతాల అభివృద్ధికి దక్షిణ కొరియాలో అమలు జరుగుతున్న విధానాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ఇతర దేశాలకు దక్షిణ కొరియా అందిస్తున్న సహకారంపై చర్చ జరిగింది.

సియోల్ నగరం ఎదుర్కొన్న నిర్దిష్ట సవాళ్లను, సవాళ్లను తగ్గించడానికి అనుసరించిన వివిధ పునరాభివృద్ధి పునరుద్ధరణ చర్యల వివరాలను సియోల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఇన్హీ కిమ్, సియోల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ హుయ్ షిన్ వివరించారు.

చివరగా జరిగిన కార్యక్రమంలో పట్టణ మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధులు సమీకరించడానికి అమలు చేసిన చర్యలను చైనా, రష్యా, యూరోపియన్ కమిషన్, భారతదేశం నుండి వచ్చిన ప్రతినిధులు వివరించి వీటికి సంబంధించి అధ్యయన పత్రాలు సమర్పించారు.

తరగతి కార్యక్రమాలు ముగిసిన తర్వాత ప్రతినిధులు విజయవంతంగా అమలు జరుగుతున్న మూడు ప్రాజెక్టులను సందర్శించారు. (తి) నీటి సరఫరా మెరుగు పరిచి స్థిరమైన , సమ్మిళిత నీటి సరఫరా కోసం స్మార్ట్ యాజమాన్య విధానంలో నిర్మించిన వీసీఐసీడీపీ ప్రాజెక్ట (తితి) పునరుద్ధరణ పనులు, పర్యావరణ పరిరక్షణ కోసం నిర్మించిన నీటిపై తేలియాడే 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ను (తితితి)ఘన వ్యర్థాల యాజమాన్యం లో ప్రైవేట్ రంగ పాత్ర ప్రాధాన్యత తెలుసుకోవడానికి వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి నిర్మించిన కేంద్రాన్ని ప్రతినిధులు సందర్శించారు.

అనుభవాల నుంచి నేర్చుకోవడానికి, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని చేపట్టి అమలు చేసిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై అవగాహన పొందడానికి వర్క్‌షాప్ ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందించింది. జీ-20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం నిర్వర్తిస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ప్రతినిధులు, 2023 మౌలిక సదుపాయాల కార్యాచరణ ప్రణాళిక కింద స్వయంగా వివరాలు తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన అధ్యయన యాత్రలు, చర్చల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వర్క్ షాప్ నిర్వహణతో రెండు రోజుల పాటు విశాఖపట్నంలో జరిగిన వర్కింగ్ గ్రూప్ సమావేశాలు ముగిసాయి. గ్రూప్ తదుపరి సమావేశం ఉత్తరాఖండ్ లోని రుషికేశ్ లో 2023 జూన్ 26,27,28 తేదీల్లో జరుగుతుంది.

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ.. తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




వరంగల్, మార్చి 31: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పాదయాత్ర కన్వీనర్ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఏడో రోజు శుక్రవారం శాయంపేటలో కొనసాగింది. అంతకు ముందు పరకాల పట్టణం నుండి బయలుదేరి పెద్ద కోడెపాక, మాందారి పేటల మీదుగా శాయంపేటకు చేరుకున్నది. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను, పరిశ్రమలను ఆపివేసిందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయకుండా తొమ్మిదేళ్లు కాలయాపన చేసిందన్నారు.

విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసమే సీపీఐ పోరాడుతున్నదని, ఇతర పార్టీల మాదిరిగా కుర్చీ కోసం కాదన్నారు.

విభజన హామీలతో పాటు పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు వేసుకుని నివసిస్తున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని, గనుల ప్రైవేటీకరణ నిలిపివేసి, సింగరేణి ఆధ్వర్యంలో మైనింగ్ నిర్వహించాలని, హైదరాబాద్ నుండి జనగామ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఈ పాదయాత్రలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, షేక్ బాషుమియా, జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎన్.అశోక్ స్టాలిన్, మండ సదా లక్ష్మీ, నాయకులు కొట్టెపాక రవి, ల్యాదెళ్ల శరత్, బత్తిని సదానందం, అనుకారి అశోక్, పైండ్ల క్రాంతికుమార్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో పడి అన్నదమ్ముల మృతి

వరంగల్, మార్చి 31: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురు చెరువులో పడి మృతిచెందిన ఘటన వరంగల్ నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని చాకలి ఐలమ్మ నగర్ లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న లక్ష్మీబాయి, లకన్ సింగ్ దంపతులు. లకన్ సింగ్ మార్కెట్లో హమాలీ పని చేస్తుండగా, లక్ష్మీబాయి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం అన్నదమ్ములిద్దరూ బహిర్భూమి కోసమై కోట చెరువు వద్దకు వెళ్లి, తిరిగి రాని లోకాలకు పోయారు. కాలుజారి పోయి చెరువులో పడి మృతిచెందిన ఘటన తీవ్రంగా కలిచి వేసింది.

ఉదయం వరకు ఇంట్లోనే కళ్ళముందు తిరిగిన అన్నదమ్ములు, కొద్ది క్షణాల్లోనే విగత జీవులుగా పడి కన్పించడంతో చాకలి ఐలమ్మ నగర్ లో రోదనలు మిన్నంటాయి. సీపీఎం నేతృత్వంలోని చాకలి ఐలమ్మ నగర్ లోని గుడిసెలో టాయిలెట్స్ లేక పోవడంతో ఇద్దరు బాలురు నిండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి పోయాయి. మృతులు కిరణ్ సింగ్ (12), దీపక్ సింగ్(9)లుగా గుర్తించారు. ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పంటనష్ట నివేదికలను పక్కాగా రూపొందించాలి-కలెక్టర్

మహబూబాబాద్, మార్చి 31 :(నేటినిజం ప్రతినిధి): పంటనష్ట నివేదికలను పక్కాగా రూపొందించాలని, 3 రోజుల్లో తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో పంట నష్ట నివేదికలను రూపొందించడంలో అదనపు కలెక్టర్ తో కలిసి వ్యవసాయ శాఖ సంబంధిత అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ? జిల్లాలో 9,100 మంది రైతులకు సంబంధించి 21,408 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పంట నష్ట నివేదికలను వాస్తవాలతో రూపొందించేందుకు వ్యవసాయ శాఖ లోని 85 క్లస్టర్ లలో 27 క్లస్టర్ లలో పంటనష్టం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతు వివరాలు సమగ్రంగా సేకరించి నివేదికకు జతపరచి సమర్పించాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్ లు ప్రతిరోజు రూపొందించిన నివేదికలు అందించాలన్నారు.

# నేషనల్ మేరిటైమ్ వీక్ ప్రారంభం అయిన సందర్భంలో అభినందనల ను తెలియ జేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 31:ఓడరేవు లు కేంద్ర స్థానం లో నిలబెడుతూ చోటు చేసుకొనేటటువంటి అభివృద్ధి ప్రయాసల కు మరియు ఆర్థిక సమృద్ధి కోసం సముద్రతీర ప్రాంతాల ను ఉపయోగించుకొనే ప్రయాసల కు నేషనల్ మేరిటైమ్ వీక్ మరింత బలాన్ని జోడిస్తుందన్న ఆకాంక్ష ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

నేషనల్ మేరిటైమ్ వీక్ మొదలైన సందర్భం లో ప్రధాన మంత్రి కోటు కు తొలి మేరిటైమ్ ఫ్లాగ్ యొక్క నమూనా ను అలంకరించిన సంగతి ని గురించి కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఒక ట్వీట్ లో తెలియజేయగా, ఆ ట్వీట్ కు శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యుత్తరాన్ని ఇచ్చారు.

నేషనల్ మేరిటైమ్ డే ను ఏప్రిల్ 5 వ తేదీ న పాటించడం జరుగుతుంటుంది. మరి ఆ రోజు న భారతదేశం యొక్క సముద్ర సంబంధి సంప్రదాయం తాలూకు గౌరవశాలి చరిత్ర ను ఉత్సవం గా జరుపుకొంటారు.

"మన సమృద్ధమైనటువంటి సముద్ర సంబంధి చరిత్ర తో మనకు గల అనుబంధాన్ని నేషనల్ మేరిటైమ్ వీక్ గాఢతరం చేయు గాక. నౌకాశ్రయాల ను కేంద్ర స్థానం లో నిలబెడుతూ జరిగే అభివృద్ధి కి మరియు ఆర్థిక సమృద్ధి కై సముద్రతీర ప్రాంతాల ను ఉపయోగించుకొనే ప్రయాసల కు ఈ నేషనల్ మేరిటైమ్ వీక్ తో మరింత బలం లభించు గాక." అని పేర్కొన్నారు.

# భారత్ అధ్యక్షతన సాగుతున్న జి-20 సదస్సులలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజన సదస్సుకు హాజరైన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మార్చి 31:భారతదేశం 2047 లో స్వాతంత్ర్య శతవార్షికోత్సవం జరుపుకునే సందర్భాన్ని నిర్వచించేది ఈనాటి యువతేనని, ప్రధాని నరేంద్ర మోదీ ఆశించిన నవ భారత నిర్మాణంలో పాల్గొనే అవకాశం దక్కటం నేటి భారత యువతకు గౌరవమని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర ప్రతిపత్తి), ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి ( స్వతంత్ర ప్రతిపత్తి), ప్రధాని కార్యాలయం సహాయ మంత్రి, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

'భారత జి-20 అధ్యక్షతన యువత పాత్ర' మీద కతువా లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటైన యువజన సదస్సునుద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జి-20 బాధ్యతలు చేపట్టిన తరుణంలో భాగస్వాములు కావటం యువత తమ అదృష్టంగా భావించాలని ఆయన అభివర్ణించారు. సుసంపన్నమైన భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటి చెప్పటంలో యువత కీలకపాత్ర పోషించే అవకాశం దక్కిందని, అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం కనుక్కొనే దిశలో యువత కృషి చేయాలని అన్నారు.

ప్రపంచాన్ని ముందుకు నడిపించగల శక్తి సామర్థ్యాలు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని భారతదేశానికి ఉన్నాయని గ్రహించటం వల్లనే ప్రపంచం ఈ రోజు భారత్ తలుపు తడుతున్నదని, భారత్ ను ప్రపంచ నాయకురాలిగా చూస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ అభివర్ణించారు.

ప్రభుత్వం ఈ దేశ యువతకు అంకితమైందని చెబుతూ, యువత సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గెజిటెడ్ అధికారులు ధృవీకరించాల్సిన అవసరం లేకుండా చేయటం, నాన్- గెజిటెడ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు అవసరం లేకుండా చేయటం లాంటి నిర్ణయాలు తీసుకోవటానికి కారణం భారత యువత మీద ఉన్న బలమైన నమ్మకమేనన్నారు.

స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా నిజానికి యువతకు అంకితం చేసినవేనని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. 2014 లో కేవలం 350 అంకుర సంస్థలు ఉండగా ఇప్పుడు 90 వేలకు పైబడటం, అందులో 100 కు పైగా యూనికార్న్ సంస్థలు కావటం అందుకు నిదర్శనమన్నారు. జమ్ము కాశ్మీర్ లోని దోడా జిల్లాలో ఆరోమా మిషన్ కింద ఏర్పాటైన అనేక అంకుర సంస్థలు ఉద్యోగాలు వదిలేసిన యువత భవిష్యత్తును తీర్చిదిద్ది ఇప్పుడు వాళ్ళు లక్షల్లో సంపాదించుకునేట్టు చేశాయి.

ప్రధాని నరేంద్ర మోదీ ఆశించిన నవ భారత నిర్మాణంలో పాల్గొనే అవకాశం దక్కటం నేటి భారత యువతకు గర్వకారణమని, యువత అవకాశాలను వాడుకుంటూ 'విశ్వగురువు' దిశగా సాగుతున్న భారత యాత్రలో చురుకైన భాగస్వాములు కావాల్సిన సమయం వచ్చిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ దేశ యువతకు నైపుణ్యాభివృద్ధికి వందలాది అవకాశాలు సృష్టించబడ్డాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారతదేశాన్ని విశ్వగురువుగా నిలపాలని కోరారు.

20 వ శతాబ్దపు భారతదేశ యువతకు శ్యాం ప్రసాద్ ఆదర్శప్రాయుడని చెబుతూ, 34 ఏళ్ల వయసు లోనే కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ కావటాన్ని గుర్తు చేశారు. జాతీయ సమైక్యత కోసం జీవితాన్ని త్యాగం చేసిన శ్యామ ప్రసాద్ ముఖర్జీని స్మరించుకుంటూ ఈ సదస్సును కతువాలో నిర్వహిస్తున్నట్టు కూడా మంత్రి చెప్పారు. ఆయన వారసత్వాన్ని ముందుకు నడిపించాల్సిన బాధ్యత ఈ దేశ యువత మీద ఉందన్నారు.

ఈ యువజన సదస్సులో పాల్గొన్నవారిలో కతువా డిప్యూటీ కమిషనర్ రాహుల్ పాండే, కతువా డీడీసీ వైస్ చేర్ పర్సన్ రఘునందన సింగ్ బబ్లూ, కతువా నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ సోమ దత్ జర్ద్ తో బాటు కతువా లోని వివిధ సంస్థల విద్యార్థులు, కతువా జిల్లాలోని వివిధ ప్రాంతాల యువత ఉన్నారు.

# "స్వచ్ఛోత్సవ్ 2023- అక్టోబర్ 2024 నాటికి 1000 నగరాలను 3-స్టార్ చెత్త రహిత నగరాలుగా మార్చాలన్నది లక్ష్యం" దిహర్దీప్ ఎస్. పూరి




న్యూఢిల్లీ, మార్చి 31:అక్టోబర్ 2024 నాటికి 1000 నగరాలను చెత్త రహిత 3-స్టార్ నగరాలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ హర్దీప్ ఎస్. పూరి చెప్పారు. న్యూ ఢిల్లీలో అంతర్జాతీయ జీరో వేస్ట్ డే 2023 సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ యుఎల్‌బిల మధ్య పోటీతత్వం, మిషన్-మోడ్ స్ఫూర్తిని ప్రోత్సహించడానికి జనవరి 2018లో ప్రారంభించిన జిఎఫ్‌సి-స్టార్ రేటింగ్ ప్రోటోకాల్‌లో పురోగతిని వివరించారు. సర్టిఫికేషన్... ప్రారంభం నుండి విపరీతంగా పెరిగిందన్నారు. దేశం నలుమూలల ఉన్న 'స్వచ్ఛతా దూత్స్' తో ఆయన సంభాషించారు. సమాజంలో పరివర్తన కలిగించే నాయకులుగానే కాకుండా సవాళ్ళను కూడా జీవనోపాధి అవకాశాలుగా మార్చుకున్నారని మంత్రి వారిని అభినందించారు.

మిషన్ విజయాల గురించి మంత్రి మాట్లాడుతూ, పట్టణ భారతదేశం బహిరంగ మలవిసర్జన రహితంగా (ఓడిఎఫ్) మారిందని, మొత్తం 4,715 పట్టణ స్థానిక సంస్థలు (యుఎల్‌బిలు) పూర్తిగా ఓడిఎఫ్‌గా ఉన్నాయని తెలిపారు. 3,547 యుఎల్‌బిలు... క్రియాశీలకంగా, పరిసరాలు పరిశుభ్రంగానూ, 1,191 యుఎల్‌బిలు ఓడిఎఫ్+గా ఉన్నాయని తెలియజేశారు. ఇంకా, భారతదేశంలో వ్యర్థాల ప్రాసెసింగ్ 2014లో 17% నుండి 75%కి నాలుగు రెట్లు పెరిగింది. 97% వార్డులలో 100% ఇంటింటికీ చెత్త సేకరణ, దేశంలోని అన్ని యుఎల్‌బిల లోని దాదాపు 90% వార్డులలో పౌరులు వ్యర్థాలను తొలి స్థాయిలోనే వేరు చేయడం ద్వారా ఇది సహాయపడింది. ఎస్బిఎంయు-యు లక్ష్యాలను సాధించడంలో చూపిన సంకల్పం, రెండవ దశ మిషన్ ( ఎస్బిఎంయు-యు 2.0)లో అనేక రెట్లు విస్తరిస్తున్నామని శ్రీ పూరి విశ్వాసం వ్యక్తం చేశారు, ఇక్కడ భారతదేశం చెత్త రహిత దేశంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగ విధానాలలో మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ వ్యర్థాల ఉత్పత్తిని పెంచుతున్నందున, దేశంలో వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన పెంపొందించడంలో 'చెత్త రహిత నగరాలు' ర్యాలీ ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.

స్వచ్ఛత ఇప్పుడు జన ఆందోళన్, పౌరుల నుండి అద్భుతమైన మద్దతును అందుకుంటుంది. మిషన్ దేశవ్యాప్తంగా మిలియన్ల మంది పౌరులను పరిశుభ్రంగా, పచ్చగా, చెత్త రహితంగా మార్చే లక్ష్యంతో సమీకరించింది. పట్టణ స్వచ్ఛత దిశగా సానుకూల అడుగులు వేసిన యువకులు, మహిళా నాయకులు పెద్దఎత్తున సమీకరించడానికి ఈ ప్రచారాలు దోహదం చేసాయి. నగరాలను చెత్త రహితంగా మార్చే ప్రయత్నాలు మార్చి 7వ తేదీన కేంద్ర మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి స్వచ్ఛోత్సవ్ 2023 ప్రారంభించడంతో కొత్త ఊపును అందుకున్నాయి.'చెత్త రహిత నగరాలు 2023' లక్ష్యాన్ని సాధించేందుకు మహిళల భాగస్వామ్యం, నాయకత్వాన్ని పెంచడం ఈ ప్రచారం లక్ష్యం. 'చెత్త రహిత నగరాల' నిర్మాణం దిశగా 8 మార్చి, 2023 నుండి నగరాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛోత్సవ్ ప్రచారం 4,00,000 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు పట్టణ పరిశుభ్రతలో నాయకత్వ పాత్ర పోషించడానికి ఒక వేదిక..

గౌరవనీయులైన ప్రధాన మంత్రి స్వచ్ఛ్ భారత్ మిషన్- అర్బన్ 2.0ని ప్రారంభించారు, "చెత్త రహిత నగరాలు" (జిఎఫ్ సి)గా మార్చాలనే దృష్టితో, సంపూర్ణ పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ పర్యావరణ వ్యవస్థ వైపు భారతదేశాన్ని అభివృద్ధి పథంలోతీసుకెళ్తోంది. డోర్-టు-డోర్ కలెక్షన్ సాధించడం, సోర్స్ సెగ్రిగేషన్, వేస్ట్ ప్రాసెసింగ్, డంప్‌సైట్ రెమెడియేషన్, కెపాసిటీ బిల్డింగ్, డిజిటల్ ట్రాకింగ్ మొదలైనవి జిఎఫ్ సి ని రూపొందించడంలో భాగాలు. భారతదేశం కూడా బాధ్యతాయుతమైన ఉత్పత్తి, వినియోగం, జీరో-వేస్ట్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. క్లోజ్డ్, సర్క్యులర్ సిస్టమ్‌లో ఉత్పత్తులను విసర్జించడం ప్రధానంగా చేపట్టింది. 'చెత్త రహిత నగరాల కోసం ర్యాలీ'ని జన్ ఆందోళన్‌కు మహిళలు నాయకత్వం వహించారని మంత్రి ప్రశంసించారు, ఇందులో లక్షలాది మంది పౌరులు తమ వీధులు, పరిసరాలు, పార్కులను శుభ్రపరిచే బాధ్యతను తీసుకున్నారు.

ఎంఓహెచ్యుఏ కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి, వ్యర్థాల నిర్వహణలో సర్క్యులారిటీని నిర్ధారించడంలో, వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చే జీరో-వేస్ట్ విధానాన్ని అమలు చేయడంలో మహిళా నాయకత్వం పాత్రను ప్రశంసించారు. స్వయం సహాయక సంఘాలను వృత్తిపరమైన స్థాయికి పెంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు, తద్వారా ఈ సమూహాలకు అధిక ఆదాయాన్ని అందించవచ్చు. ఇంకా, 'విమెన్-ఇన్ గార్బేజ్ మేనేజ్‌మెంట్' నుండి 'మహిళల నేతృత్వంలోని చెత్త రహిత నగరాలు' వరకు మన గౌరవనీయులైన ప్రధాన మంత్రి దార్శనికత కు అనుగుణంగా ఆశించిన ఫలితాలను చూపుతున్నాయి.కేంద్ర మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్లు, కమిషనర్లు, మిషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు, వారు చెత్త రహిత నగరాల్లో సర్క్యులారిటీ, మహిళలు, యువత, భాగస్వామ్యం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో బీహార్, జార్ఖండ్, యుపి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ ఉత్తమ అభ్యాసాలను, విజయగాథలను పంచుకున్నారు.

# ముందస్తుకు వెళ్తే జగన్ ముందుగా ఇంటికి వెళ్లటమే - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, మార్చి 31: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏపీలో ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని అలా ముందస్తుకు వెళ్తే ఘోర ఓటమిపాలై ముందుగా ఇంటికి వెళ్లడం ఖాయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జోస్యం చెప్పారు. మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రైతులు రైతు కూలీలు నిరసన దీక్షలు చేపట్టి శుక్రవారంతో 1200 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సిపిఐ కార్యాలయం నుండి మందడం గ్రామానికి రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపేందుకు భారీగా తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ, జగన్ ఓ మూర్ఖపు ముఖ్యమంత్రి అని అభివర్ణించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన ప్రజలు వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హైకోర్టు అమరావతికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా అక్కడ కూడా ప్రభుత్వానికి ప్రతికూల తీర్పు వచ్చిందని వివరించారు. భారతీయ జనతా పార్టీ నేతలు రాష్ట్రంలో జగన్ ను విమర్శిస్తూ ఢిల్లీలో మాత్రం వత్తాసు పలుకుతున్నారని అన్నారు.

మెడలు వంచుతానని మోకాళ్ళ వద్ద కూర్చున్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు వంటి వాటిపై కేంద్రం మెడలు వంచుతానని డిమాండ్లు సాధించుకుంటారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రం మోకాళ్ల వద్ద కూర్చున్నారని రామకృష్ణ విమర్శించారు. జగన్ కోరుకున్న విశాఖలోనే ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని విద్యావంతులు చిత్తుగా ఓడించారని అన్నారు.

కేసులు పెట్టి బెదిరించినా వెనకడుగు వేయలేదు..

1,200 రోజులుగా రైతులు రైతు కూలీలు మహిళలు అమరావతి సాధన కోసం ఉద్యమిస్తున్నారని ప్రభుత్వం కేసులు పెట్టి ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టినప్పటికీ ఏ మాత్రం వెనకడుగు వేయలేదని ఈ పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని రామకృష్ణ పేర్కొన్నారు. విశాఖలో వైసీపీ నేతలు 40 వేల ఎకరాలను కబ్జా చేసినట్లు చెబుతున్నారని దీనిని బట్టి అక్కడ రాజధానిని ఏర్పాటు విషయమై అక్కడ ప్రజలు కూడా సానుకూలంగా లేరని అన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి అక్కడి ప్రజలను కూడా మోసం చేశాడని ఆరోపించారు. ఇప్పటికైనా మూడు ముక్కలాట మానుకొని అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించి జగన్ విజ్ఞతను చాటుకోవాలని రామకృష్ణ హితవు పలికారు.

175 లో ఒక అంకె ఎగరటం ఖాయం.

ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము 175 స్థానాల్లో గెలుస్తామని జగన్మోహన్ రెడ్డి తరచూ ప్రకటిస్తున్నారని ఇదంతా ఓ మైండ్ గేమ్ అని రామకృష్ణ అన్నారు. 175 లో ఒక అంకె ఎగరటం మాత్రం కచ్చితంగా జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. జగన్ ఇంటికి వెళ్తే రాష్ట్రానికి విముక్తి కలుగుతుందని అప్పుడు అమరావతి అభివృద్ధి చెందుతుందని పోలవరం నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కలిసొచ్చే పార్టీలతో ముందుకు వెళ్లేందుకు సిద్ధం.

ప్రభుత్వ తీరు పట్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని విద్యావంతులు వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండాలని కోరుకోవటం లేదని రామకృష్ణ తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపిని సాగనంపుతామని కలిసి వచ్చే పార్టీలతో పొత్తుకు సిద్ధమని జనసేన కలిసి నడుస్తామని అన్నారు. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో జనసేన బిజెపికి మద్దతు ఇవ్వలేదని అయినప్పటికీ జనసేన తమతోనే ఉందని బిజెపి నేతలు ప్రకటించుకోవటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ బిజెపి జేఎస్పీలు కలిసి నడుస్తాయని తాము అనుకోవటం లేదని తెలిపారు. కేంద్రంలో బిజెపిని గద్దె దింపేందుకు 16 ప్రతిపక్ష పార్టీలు ఏకతాటి పైకి నడిచేందుకు సిద్ధమవుతున్నాయని అన్నారు. కర్ణాటకలో బిజెపి ఓడిపోవడం ఖాయమని అదే వ్యతిరేక పవనాలు దేశం మొత్తం వేస్తాయని తెలిపారు. కేంద్రంలో బిజెపిని రాష్ట్రంలో వైసిపిని ప్రజలు ఇంటికి సాగనంపుతారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వ రరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య నాయకులు జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు

# పోప్ శ్రీ ఫ్రాన్సిస్ త్వరగా కోలుకోవాలి అనే ఆకాంక్ష ను వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 31:పోప్ (రోమన్ కేథలిక్కుల ప్రధాన గురువు) శ్రీ ఫ్రాన్సిస్ కు మంచి ఆరోగ్యం ప్రాప్తించాలి, వారు త్వరిత గతి న పునఃస్వస్థులు కావాలి అనే ఆకాంక్ష ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

"పోప్ శ్రీ ఫ్రాన్సిస్ కు మంచి ఆరోగ్యం ప్రాప్తించాలి మరియు వారికి త్వరిత గతి న పునఃస్వస్థత చేకూరాలంటూ ఆ ఈశ్వరుడి ని ప్రార్థిస్తున్నాను." అని ఒక ట్వీట్ లో పేర్కొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీల కంప్యూటరీకరణతో పాటు పలు అభివృద్ధి పనులు




న్యూఢిల్లీ, మార్చి 31:ఉత్తరాఖండ్ లోని మల్టీపర్పస్ ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలు (ఎంపీఏసీఎస్), జాయింట్ కోఆపరేటివ్ ఫార్మింగ్, జన సువిధ కేంద్రాలు, జనౌషధి కేంద్రాల కంప్యూటరీకరణను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు హరిద్వార్ లో ప్రారంభించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామితో సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2021 అక్టోబర్ 30న దేశంలోనే తొలిసారిగా ఉత్తరాఖండ్ లో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్ ) కంప్యూటరీకరణ పనులు మొదలయ్యాయని, ఈ రోజు రాష్ట్రంలోని మొత్తం 670 పీఏసీఎస్ ల కంప్యూటరీకరణ పూర్తయిందని శ్రీ అమిత్ షా తమ ప్రసంగంలో తెలిపారు.

ఎంపీఏసీఎస్ కోసం మోడల్ బైలాస్ ను కొంతకాలం క్రితమే రాష్ట్ర ప్రభుత్వాలకు పంపామని, ఉత్తరాఖండ్ లో 95 ఎంపీఏసీల ఏర్పాటు పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. దీనితో పాటు, సహకార సంఘాల కింద 95 జన ఔషధి కేంద్రాలు , జన సువిధ కేంద్రాలను ప్రారంభించిన మొదటి రాష్ట్రం ఉత్తరాఖండ్ అని శ్రీ షా చెప్పారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ "సహకార్ సే సమృద్ధి " అనే దార్శనికతతో దేశంలో ఒక ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.

సహకార మంత్రిత్వ శాఖ ద్వారా దేశంలోని మొత్తం 65,000 క్రియాశీల పిఏసిఎస్ ల కంప్యూటరీకరణ ప్రారంభమైంది. 307 జిల్లా సహకార బ్యాంకులతో పాటు పలు సౌకర్యాలను కంప్యూటరీకరణ చేశామన్నారు. ఈ రోజు 307 సహకార బ్యాంకు శాఖలు, 670 ఎంపిఏసిఎస్ ల కంప్యూటరీకరణను పూర్తి చేయడం ద్వారా ఉత్తరాఖండ్ ప్రభుత్వం సహకార రంగంలో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించిందని శ్రీ షా తెలిపారు. కంప్యూటరీకరణ వల్ల వ్యవస్థలో పూర్తి పారదర్శకత వస్తుందని, ఆడిట్ ఆన్ లైన్ లో జరుగుతుందని, దీనివల్ల పీఏసీఎస్ ల ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడుతుందని అన్నారు. 95 జన సువిధ కేంద్రాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 300కు పైగా పథకాలను నేరుగా గ్రామాలకు చేరవేస్తామని చెప్పారు. సహకార జన ఔషధి కేంద్రాల ద్వారా 50 నుంచి 90 శాతం చౌక మందులు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఉత్తరాఖండ్ లోని 95 డెవలప్ మెంట్ బ్లాక్ లలో ఇంటిగ్రేటెడ్ కలెక్టివ్ కోఆపరేటివ్ ఫార్మింగ్ నమూనాను ఈ రోజు ప్రారంభించినట్లు శ్రీ షా తెలిపారు.

సహకార మంత్రిత్వ శాఖ చొరవతో సహారా గ్రూపునకు చెందిన 4 సహకార సంఘాల్లో తమ డబ్బును డిపాజిట్ చేసిన సుమారు 10 కోట్ల మంది డిపాజిటర్లకు డబ్బును తిరిగి ఇవ్వాలని సుప్రీంకోర్టు నిన్న ఆదేశించించిన విషయాన్ని శ్రీ అమిత్ షా ప్రస్తావించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో సహారా గ్రూప్ లోని ఇన్వెస్టర్లందరికీ వారి సొమ్ము తిరిగి వస్తుందని ఆయన అన్నారు. సహారా గ్రూప్ ఇన్వెస్టర్లందరూ తమ దరఖాస్తులను సెంట్రల్ రిజిస్ట్రార్ కు పంపవచ్చని, వెరిఫికేషన్ తర్వాత 3-4 నెలల్లో తమ డబ్బును తిరిగి పొందవచ్చని శ్రీ షా తెలిపారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ "సహకార్ సే సమృద్ధి" మంత్రం ద్వారా అనేక కొత్త చర్యలను తీసుకున్నారని సహకార మంత్రి అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం జాతీయ కోఆపరేటివ్ యూనివర్సిటీ, నేషనల్ కో-ఆపరేటివ్ పాలసీ, కో-ఆపరేటివ్ డేటాబేస్ ను రూపొందిస్తోందని ఆయన చెప్పారు. వీటితోపాటు విత్తనాలు, సేంద్రియ వ్యవసాయ మార్కెటింగ్, రైతుల ఉత్పత్తుల ఎగుమతుల కోసం మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో నల్ సే జల్ (కుళాయి నుంచి నీరు) పథకాన్ని పీఏసీఎస్ లకు అప్పగిస్తామని, కేంద్ర ప్రభుత్వం పంపిన బహుముఖ పీఏసీఎస్ ల మోడల్ బైలాస్ లో పీఏసీఎస్ లు కూడా గ్రామానికి నీటిని అందించగలుగుతాయని తెలిపారు.

ఇప్పుడు పీఏసీఎస్ లు అనేక రకాల పనులు చేయగలవని చెప్పారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం ద్వారా చిన్న భూ కమతాలు ఉన్న అనేక మంది సన్నకారు రైతులను అనేక రకాల వ్యాపారాలతో అనుసంధానించారని చెప్పారు. పీఏసీఎస్ లను బహుళార్థసాధకంగా మార్చడం ద్వారా సహకార సంఘాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ బలమైన చర్య తీసుకున్నారని తాను విశ్వసిస్తున్నట్టు చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సహకార రంగంలో చేపట్టిన అన్ని కార్యక్రమాలను శ్రీ పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోని ఉత్తరాఖండ్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు చేసిందని, ఇది దేవభూమిలోని చిన్న రైతులకు ప్రయోజనం చేకూర్చిందన్నారు.

# ఏప్రిల్ 1న భోపాల్ సందర్శించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 31:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 ఏప్రిల్ 1న భోపాల్‌లో పర్యటిస్తారు. ఆ రోజున ఉదయం 10 గంటల ప్రాంతంలో నగరంలోని కుశభావ్ ఠాక్రే హాల్‌లో నిర్వహించే కమాండర్ల సంయుక్త సదస్సు-2023కు ఆయన హాజరవుతారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3:15 గంటలకు భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వే స్టేషన్‌లో భోపాల్-న్యూఢిల్లీ మధ్య 'వందేభారత్ ఎక్స్'ప్రెస్ రైలును ప్రధాని జెండా ఊపి ప్రారంభిస్తారు.

**కమాండర్ల సంయుక్త సదస్సు-2023**

భోపాల్‌లో 'సంసిద్ధత- సముద్ధరిత- సముచిత బలగాలు' ఇతివృత్తంగా సాయుధ బలగాల కమాండర్ల సదస్సు 2023 మార్చి 30 నుంచి ఏప్రిల్ 1దాకా మూడు రోజులపాటు జరుగుతుంది. ఈ సందర్భంగా, సాయుధ దళాలలో సంయుక్త, ఉమ్మడి పద్ధతులలో కర్తవ్య నిర్వహణసహా జాతీయ భద్రత సంబంధిత వివిధ రకాల అంశాలపై చర్చలు సాగుతాయి. 'స్వయం సమృద్ధి' సాధన దిశగా సాయుధ బలగాల సన్నద్ధతతోపాటు రక్షణ పర్యావరణ వ్యవస్థలో పురోగతిని కూడా సమీక్షిస్తారు. ఈ సదస్సులో త్రివిధ సాయుధ దళాల కమాండర్లు, రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొంటారు. అలాగే చర్చల్లో భాగస్వాములయ్యే సైనికులు, నావికులు, వైమానిక దళ సిబ్బంది మధ్య సార్వజనీన, సాధారణ పరస్పర చర్చలు కూడా కొనసాగుతాయి.

**వందేభారత్ ఎక్స్'ప్రెస్**

దేశంలో ప్రజల ప్రయాణానుభవాన్ని 'వందేభారత్' ఎక్స్'ప్రెస్ పూర్తిగా పునర్నిర్వచించింది. ఈ నేపథ్యంలో భోపాల్ నగరంలోని రాణి కమలాపతి రైల్వే స్టేషన్ నుంచి న్యూఢిల్లీ స్టేషన్ మధ్య ప్రవేశపెట్టిన కొత్త రైలు దేశంలో 11వ 'వందే భారత్' రైలు అవుతుంది. దేశీయంగా రూపొందించిన ఈ రైలులో అత్యాధునిక ప్రయాణిక సౌకర్యాలున్నాయి. ఇది ప్రయాణికులకు వేగవంతం, సౌకర్యవంతం, సుఖవంతమైన ప్రయాణ అనుభవం కల్పిస్తుంది. అలాగే పర్యాటకాన్ని పెంచడంతో పాటు ఈ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధిని కూడా ప్రోత్సహిస్తుంది

# రబీకి సంబంధించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు

మెదక్, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి):రబీకి సంబంధించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయుటకు ఈ నెల 3 వ వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఒక యజ్ఞంలా భావించి అందరు సమన్వయంతో పారదర్శకంగా పనిచేయాలని అందుకు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండవలసినదిగా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి ధాన్యం దిగుబడి, కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రబీలో 94 వేల హెక్టార్లలో రైతులు వరి సాగుచేస్తున్నారని, వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం మార్కెట్ కు 5 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశామున్నదని, అందుకనుగుణంగా 413 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 290, ఐ.కెపి. ద్వారా 110, డిసిఎంఎస్ ద్వారా 8, రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా 5 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రతి కేంద్రంలో షామియానా, మంచినీరు, శౌచాలయాల వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్ కు వచ్చే ధాన్యం మేరకు కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పన ఆధారపడి ఉంటుందని, కాబట్టి వ్యవసాయాధికారులు మరోమారు రైతులు వారీగా, గ్రామా వారీగా రైతులు ఎన్ని ఎకరాలలో పంట వేశారు, రైతుల అవసరాలు, విత్తనాలకు పోగా ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాల వచ్చే అవకాశ ముందో వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా నిర్ణీత నమూనాలో మరోమారు ఖచ్చితమైన సమాచారం సేకరించి వెంటనే అందజేయవలసినదిగా కలెక్టర్ జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించారు. అదేవిధంగా తాళ్లు లేకుండా, 17 శాతం తేమ మించకుండా ఎఫ్.సి.ఐ. నిర్దేశించిన ప్రమాణాల కనుగుణంగా రైతులు నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తెచ్చేలా అవగాహన కలిగించాలని అన్నారు. ఏ గ్రామం, ఏ కేంద్రానికి ధాన్యం ఎప్పుడు తేవాలో స్పష్టం చేస్తూ టోకెన్లు ఇవ్వాలని, ప్రభుత్వం ఏ -గ్రేడు ధాన్యం క్వింటాల్ కు 2060 కు, సాధారణ రకం 2040 లకు కొనుగోలు చేయుటకు మద్దతు ధర ప్రకటించిందని, కొనుగోలు జరిగే వరకు రైతులు సంయమనం పాటించేలా సూచించాలని అన్నారు. ధాన్యం సేకరణకు కోటి 50 లక్షల గొనె సంచులు అవసరం కాగా 75 లక్షలు అందుబాటులో ఉన్నాయని, మిగతా వాటికీ చర్యలు తీసుకోవలసిందిగా డీఎస్ ఓ కు సూచించారు. ట్యాబ్ ఎంట్రీ కి కొత్త వర్షన్ 8. 0 నూతన ట్యాబ్ లు కొనుగోలు చేయవలసినదిగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ధాన్యం అన్ లోడింగ్ చేసుకొనుటకు ప్రతి రైస్ మిల్లులలో 40 నుడి 50 మంది హమాలీలలను ఏర్పాటు చేసుకునేలా, ధాన్యం భద్రపరచుకునేలా గోదాములను, స్థలాన్ని ఏర్పాటుచేసుకునేలా చూడాలని, మార్కెట్ కమిటీలలో, ప్రైవేట్ స్థలాల్లో ధాన్యం భద్రపరచుటకు స్థలాలు ఎంపిక చేసి సిద్ధంగా ఉంచుకోవాలని డి.ఎస్.ఓ. కు సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్, తేమను కొలిచే యంత్రాలు, డిజిటల్ కాంటాలు అందుబాటులో ఉంచుకోవాలని మార్కెటింగ్ అధికారికి సూచించాగా అదనంగా మరో 3 వేల టార్పాలిన్లు కొనుగోలు చేయుటకు అనుమతి కోరారు. ధర్మ కాంటాలు, రైస్ మిల్లులలో, కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాలు సరిగా పనిచేస్తున్నాయా పరిశీలించాలని లీగల్ మెట్రాలజీ అధికారికీ సూచించారు. వేయి లారీలు అందుబాటులో ఉంచుతూ రైస్ మిల్లులకు జియో ట్యాగింగ్ చేయాలని, లారీలను మానిటరింగ్ చేయాలని రవాణాధికారికి సూచించారు.

# ఏప్రిల్ 3 నుండి 13 వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు

మెదక్, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి):ఏప్రిల్ 3 నుండి 13 వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణం లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా, పారదర్శకంగా జరిగేలా అందరు అధికారులు సమిష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని లు అన్నారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఇరువురు టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 10,700 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయుటకు 69 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా గతంలో 11 పేపర్లు ఉండగా ప్రభుత్వం 6 ఎపర్లకు కుదించింది అన్నారు .ఏప్రిల్ 3, 10 తేదీలలో జరిగే పరీక్షలు మినహా మిగతా పరీక్షలు ఉదయం 9 .30 గంటల నుండి మధ్యాన్నం 12 .30 గంటల వరకు జరుగుతాయని అన్నారు. ఏప్రిల్ 3 న మొదటి రోజు ప్రథమ భాషగా కాంపోజిట్ కోర్సు తీసుకున్న అభ్యర్థులకు మాత్రం మధ్యాహ్నం 12.50 వరకు పరీక్ష ఉంటుందని అన్నారు.

ఉదయం 9:30 నుండి 11:30 వరకు 2 గం. పార్ట్-1 పేపర్ మరియు 11.50 నుండి మధ్యాహ్నం 12.50 వరకు పార్ట్-2 పేపర్లు వ్రాయాల్సి ఉంటుందని అన్నారు . 11:30 నుండి 11:50 వరకు ఖాళీ సమయంలో పార్టు-1 సమాధాన పత్రాలు తీసుకుని పార్ట్-2 ప్రశ్నపత్రాలు మరియు సమాధాన పత్రాలు ఇవ్వడానికి వీలుగా సమయం కేటాయించబడిందని వారు తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 10 న జనరల్ సైన్స్ పరీక్ష రోజున ఉదయం 9:30 నుండి 11.00 గంటల వరకు ఒకటిన్నర గంటలు ఫిజికల్ సైన్స్, 11. 20 నుండి 12.50 వరకు ఒకటిన్నర గంటలు బయలాజికల్ సైన్స్ పేపర్లు ఉంటాయని, 11.00 గంటల నుండి 11. 20 వరకు ఫిజికల్ సైన్స్ సమాధాన పత్రాలు తీసుకొని బయోలాజికల్ సైన్స్ ప్రశ్నపత్రాలు మరియు సమాధాన పత్రాలు ఇవ్వడానికి సమయం కేటాయించబడిందని వారు వివరించారు. పార్ట్-బిట్ పేపర్ 15 నిమిషాల ముందు మాత్రమే ఇవ్వబడుతుందని అన్నారు. ఫిజికల్ సైన్స్ పేపర్ కు ఉదయం 10:45 గంటలకు బయాలజికల్ సైన్స్ పేపర్ కు మధ్యాహ్నం 12.35 గంటలకు పార్ట్-బి బిట్ పేపర్ ఇవ్వబడుతుందని వారు తెలిపారు. . మిగిలిన అన్ని సబ్జెక్టులకు మాత్రము అరగంట ముందు మాత్రమే అనగా మధ్యాహ్నం 12.00 గంటలకు బిట్ పేపర్ ఇవ్వబడుతుందని తెలిపారు. మూడవ రోజు ఆంగ్ల భాష పరిక్ష రోజు మాత్రం బిట్ పేపరు ప్రశ్నపత్రంతో కలిపి ఇవ్వబడుతుందని, విద్యార్థులు ఈ విషయం గుర్తించాలని కలెక్టర్, ఎస్పీ లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8. 30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

అదేవిధంగా విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్ లు, శాఖాపర అధికారుతో సహా ఎవరికి సెల్ ఫోన్ లు, ఎలక్ట్రానిక్ గాడ్జెన్ అనుమతించబడవని, ప్రభుత్వం గుర్తింపు పొందిన ఐ.డి. ఉన్నారు తప్ప ఇతరులు ఎవరిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడరని స్పష్టం చేశారు. స్టోరేజి పాయింట్ లు లేని 19 పరీక్షా కేంద్రాలను గుర్తించి కస్టోడియన్ లను , పోలిసు బందోబస్తు చేశామన్నారు. ప్రతి కేంద్రంలో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రంలో బన్దదోబస్తుకు ఒక పురుష, ఒక మహిళా కానిస్టేబుల్ ను, ప్రహరీ గోడలు లేని పాఠశాలలకు అదనపు భద్రత కల్పిస్తున్నామని వారు చెప్పారు. మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు తమ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాలనుశుభ్రం చేసి అవసమైనా చోట మంచినీరు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల్ విద్యాధికారులు, తహసీల్దార్లు పరీక్షా కేంద్రాలను మరోమారు సందర్శించి బెంచీలు, టాయిలెట్స్, విద్యుత్, బెంచీలు ఉన్నాయా పరిశీలించాలన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకొని, తిరిగి గమ్య స్థానాలకు చేరేలా ఆయా రూట్ లలో బస్సులు నడపాలని ఆర్.టి.సి. అధికారులకు సూచించారు జవాబు పత్రాలను స్పీడ్ పోస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని తపాలా అధికారులకు సూచించారు. జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని, పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు ప్రథమ చికిత్స మందులతో ఏ.యెన్.ఎం. లను ఏర్పాటు చేయాలని డిఎమ్ అండ్ హెచ్ ఓ కు సూచించారు. ఏవైనా సమస్యలు, ఇబ్బందులుంటే జిల్లా విద్యాశాఖాధికారి మొబైల్ నెంబర్ 7207704500 కు లేదా పరీక్షల సహాయ కమిషనర్ మొబైల్ నెంబర్ 94916 76947 కు సంప్రదించవలసినదిగా కలెక్టర్, ఎస్పీ లు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, డీఈఓ రాధాకిషన్, ఆర్.డి.ఓ. లు, డిఎస్పీలు, డిఎమ్ అండ్ హెచ్ ఓ చందు నాయక్ చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు,మండల్ విద్యాధికారులు, ట్రెజరీ అధికారి, రవాణాధికారి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# 10/10 వచ్చిన ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలు బహుమతి అందిస్తాం

## -జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్




సత్తుపల్లి మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సత్తుపల్లి నియోజకవర్గంలోని బీసీ హాస్టల్ లో పదో తరగతి చదువుతున విద్యార్థులు ఈనెల మూడు నుంచి జరగబోయే పరీక్షల్లో 10/10 సాధించిన ప్రతి విద్యార్థికి పదివేల రూపాయలు ఇవ్వనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్ అన్నారు శుక్రవారం నాడు సత్తుపల్లిలోనే బీసీ హాస్టలోని విద్యార్థులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు చిల్లపల్లి మాధవరావు ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ తో కలిసి విద్యార్థుల పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులను బహుమతులు గా అందజేశారు అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ హాస్టల్లో చదువుకునే ప్రతి విద్యార్థి ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడాలని బీసీ హాస్టల్స్ లో చదువుకుంటున్న టు వంటి విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కన్నా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అటువంటి విద్యార్థులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ మా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దుస్సా వెంకటేశ్వర్లు, సత్తుపల్లి మండల అధ్యక్షులు పామర్తి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి గుడిదా రామకృష్ణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తినవలి రంగారావు, నియోజకవర్గ కార్యదర్శి వీరవాడ నాగభూషణం, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కోటా సత్యనారాయణ, యువజన విభాగం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బెజవాడ సాయి శేషు, యువజన విభాగం సత్తుపల్లి నియోజకవర్గ కార్యదర్శి తిరుమలరావు, సత్తుపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి రాయలకోటి, యువజన. మరియు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా పసుపు బోర్డు ఫ్లెక్సీలు

నిజామాబాద్ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ఇటీవలి కాలంలో ఫ్లెక్సీ వార్ సర్వసాధారణమై పోయింది. ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు తీసుకురాకపోవడంపై రైతులు కన్నెర్ర చేశారు. దీంతో వినూత్న ఫ్లెక్సీలకు తెరదీశారు. కానీ అర్వింద్‌కు వ్యతిరేకంగా వెలిసినవి మాత్రం కాస్త వినూత్నంగా ఉన్నాయి. ఈ మేరకు నిజామాబాద్ వ్యాప్తంగా ఫ్లెక్సీలు వెలిశాయి. 'పసుపు బోర్డు... ఇది మా ఎంపీగారు తెచ్చిన పసుపు బోర్డు' అని కాస్త వెటకారాన్ని యాడ్ చేసి మరీ నిజామాబాద్ అంతటా రైతులు ఫ్లెక్సీలను అంటించారు. ఖాళీగా ఉన్న పసుపు బోర్డుపై ఇదే మా ఎంపీ తెచ్చిన పసుపు బోర్డు అని రాసి నిరసన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో అయిదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని వాగ్దానం చేసి ఎంపీ అరవింద్ బాండ్ పేపర్ రాసిచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో నిజామాబాద్‌కి వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రామ్ మాధవ్ లు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని చెప్పి ఓట్లు వేయించుకున్న అర్వింద్ తమను మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కర్ణాటకలో కారు పార్టీకి స్పందన కరువైందా?

న్యూఢిల్లీ, మార్చి 31:కర్ణాటకలో కారు పార్టీకి స్పందన కరువైందా? త్వరలో సాధారణ ఎన్నికలు జరిగే ఆ రాష్ట్రం వైపు.. బీఆర్ఎస్ అధిపతి ఎందుకు చూడటం లేదు? మహారాష్ట్ర లో వరుస సభలు పెడుతున్న కేసీఆర్.. కర్ణాటకలో ఎందుకు అడుగు పెట్టడం లేదు? ఫ్రెండ్లీ పార్టీ జేడీఎస్ చీఫ్.. కేసీఆర్‌కు హ్యాండ్ ఇచ్చారా? పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ అరుగుతుంది .

**కర్ణాటకలో రెండు చేరికల సభలు**

జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని తలపిస్తోన్న కేసీఆర్.. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించడంపై దృష్టి పెట్టారు. పక్క రాష్ట్రాల్లో ఇతర పార్టీల నాయకులను కారెక్కించడం మీద కాన్సంట్రేట్ చేశారు. అందులో భాగంగా ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్, శశీర్ గమాంగ్, ఆంధ్రప్రదేశ్ నుంచి తోట చంద్ర శేఖర్, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు వంటి వారు బీఆర్ఎస్‌లో చేరారు. అయితే వారంతా హైదరాబాద్‌కే వచ్చి కండువా కప్పుకున్నారు. కానీ.. ఇతర రాష్ట్రాల నుంచి చేరికలకు పెద్దగా స్పందన కనిపించడం లేదు. తెలంగాణ బయట ఒక్క మహారాష్ట్రలో మాత్రం జాయినింగ్స్ పేరిట కేసీఆర్ హడావిడి చేస్తున్నారు. ఇప్పటికే అక్కడ రెండు చేరికల సభలు నిర్వహించారు. ఫిబ్రవరి 5న నాందేడ్‌లో, మార్చి26న కాందార్ లోహాలో సభలు పెట్టారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు.

**బీఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదా?**

అయితే.. మహారాష్ట్రకు దౌడు తీస్తున్న కారు.. కర్ణాటకకు ఎందుకు వెళ్లడం లేదనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికరంగా జరుగుతోంది. అక్కడ చేరడానికి ఎవరు ముందుకు రావడం లేదా? అందుకోసం కేసీఆర్ ప్రయత్నం చేయడం లేదా..? కేసిఆర్ కర్ణాటక వెళ్లకపోవడానికి మరేదైనా రీజన్ ఉందా? త్వరలో శాసనసభకు ఎన్నికలు జరిగే కర్ణాటకను వదిలేసి.. మహారాష్ట్ర పైనే కేసీఆర్ ఎందుకు ఫోకస్ చేశారన్నది.. చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే అక్కడ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. పార్టీలు ఎలక్షన్ క్యాంపైన్ స్టార్ట్ చేశాయి. అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులను సైతం ప్రకటిస్తున్నాయి. కానీ బీఆర్ఎస్‌లో కర్ణాటక ఎన్నికలపై చడీ చప్పుడు లేదు. ఎన్నికల గడువు దగ్గర పడుతున్నా.. కేసీఆర్ అక్కడ సభలు పెట్టడం లేదు. ఎవరిని చేర్చుకోవడం లేదు. మామూలుగా అయితే ఎవరూ పట్టించుకునేవారు కాదేమో కానీ.. తమ ఫస్ట్ టార్గెట్ కర్ణాటక అని ప్రకటించిన కేసీఆర్ మరీ ఇప్పుడెందుకు వెనక్కి తగ్గారనేది ఆసక్తి రేపుతోంది.

**ఆర్ఎస్‌తో కలిసి పనిచేసే విషయంలో యూటర్న్!**

దేవేగౌడ పార్టీ జేడీఎస్‌తో పొత్తు కన్ఫార్మ్ అయిందని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీతో కలిసి పోటీ చేస్తామని కేసీఆర్ గతంలో సంకేతాలు ఇచ్చారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ఏపి, తెలంగాణ కర్ణాటక సరిహద్దు జిల్లాల్లో 50 స్థానాలు తగ్గకుండా గులాబీపార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. కర్ణాటకలోని మిగతా నియోజకవర్గాల్లో జేడీఎస్‌కు కారు పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పుకున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ అధికారిక ప్రకటన కార్యక్రమంలో కేసీఆర్ పార్టీ నేతలకు కర్ణాటకలో పోటీపై క్లారిటీ ఇచ్చారు. జేడీఎస్ అధినేత కుమార స్వామి సైతం మొదట్లో కేసీఆర్ ప్రతిపాదనకు జై కొట్టారు. బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పిలిచినప్పుడల్లా వచ్చి కేసీఆర్‌కు సపోర్ట్ చేశారు. కానీ ఆ తర్వాత బిఆర్ఎస్‌తో కలిసి పనిచేసే విషయంలో కుమారస్వామి యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. మొదట్లో కేసీఆర్ పిలిచిన ప్రతిచిన్న కార్యక్రమానికి అటెండ్ అయిన కుమారస్వామి ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు రాకుండా హ్యాండ్ ఇచ్చాడు. అప్పటి నుంచి ఇటు వైపు చూడటం లేదు. దాంతో జేడీఎస్ సపోర్ట్‌తో కర్ణాటకలో అడుగు పెట్టాలని ఆశించిన బీఆర్ఎస్ బాస్ కేసీఆర్‌కు పరిస్థితులు కలిసి రావడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

**బలం లేని బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌తో వెళ్తే బెటర్!**

గతంలో కర్ణాటకలో కాంగ్రెస్‌తో కలిసి జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ మద్దతుతో 2018 మే నుంచి 2019 జూలై వరకు కుమారస్వామి కర్ణాటక సీఎంగా పనిచేశారు. తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవిని కోల్పోయారు. కర్ణాటకలో కాంగ్రెస్ అనూహ్యంగా పుంజుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. గ్రౌండ్ రియాలిటీ చూసిన తర్వాత కుమార స్వామి మనసు మార్చుకున్నట్లు టాక్. కర్ణాటకలో అసలు బలం లేని బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌తో వెళితే బెటర్ అని కుమారస్వామి ఆలోచిస్తున్నారట. కేసీఆర్ పార్టీని పోటీకి ఆహ్వానిస్తే అది బీజేపీకి మేలుచేస్తుందని అది ఇష్టం లేకే.. కర్ణాటకలో బీఆర్ఎస్ ఎంట్రీకి కుమారస్వామి ఒప్పుకోవడం లేదని తెలుస్తోంది. అందుకే హైదరాబాద్ సంస్థానంలో ఉన్న కర్ణాటక ప్రాంతం లోనూ బీఆర్ఎస్ పోటీ చేయవద్దని కేసిఆర్‌ను కుమార స్వామి కోరినట్టు సమాచారం. అందుకే కేసీఆర్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వైపు చూడడం లేదని తెలుస్తోంది. శాసన సభ ఎన్నికల అనంతరం పార్లమెంట్ కోసం కర్ణాటకలోకి ఎంట్రీ ఇచ్చి.. అప్పుడు జేడీఎస్ పార్టీ మద్దతు కోరే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

# 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్ కోర్సులు మరియు కెరీర్స్ పుస్తకాల పంపిణీ...

## -కుమ్మరి రామ్మూర్తి,నేషనల్ హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్.

మహబూబాబాద్, మార్చి 31:(నేటినిజం ప్రతినిధి): విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలంటే నిరంతర కృషి ,పట్టుదల ,ఏకాగ్రత, శ్రద్ధ ప్రణాళిక కచ్చితంగా ఉండాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ పెద్దవంగర మండల చైర్మన్ కుమ్మరి రామ్మూర్తి అన్నారు, శుక్రవారం రోజున మండలంలోని వడ్డేకొత్తపల్లి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, పెద్దవంగర ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్లో కోర్స్ మరియు కెరీర్స్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ రామ్మూర్తి మాట్లాడుతూ ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ సీఈవో వేముల శరత్ బాబు అందించిన ఈ యొక్క గొప్ప అవకాశం విద్యార్థులకు లభించిందని కొనియాడారు.ఆయిస్టర్ సంస్థ సహకారంతో హైదరాబాద్ లోని వైదేహి జిరాక్స్ సెంటర్ యజమాని గణపురం పవన్ యొక్క జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపించడం జరిగింది. ఆయిస్టర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలో పేద విద్యార్థులకు సహాయం చేయడం, అనాథలకు వృద్ధులకు మేమున్నామనే భరోసాను కల్పిస్తున్నందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు పోటీ పరీక్షలకు తట్టుకొని పదవ తరగతి జీవితానికి తొలిమెట్టుగా భావించి పైచదువులతో పాటు ఉద్యోగాలకు వెళ్లాలంటే ఒక లక్ష్యం ఉండాలన్నారు. "లక్ష్యం లేని జీవితం గాలికి ఎగిరే ఎండిపోయిన ఆకు వంటిదనిబి లక్ష్యం ఉన్న జీవితం ఎక్కుపెట్టిన బాణం వంటిదని సూచించారు.

# సీబీఐ కోర్టులో సునీత ఇంప్లీడ్ పిటిషన్...విచారణ మే 28కి వాయిదా

హైదరాబాద్ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్);' : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు లో సీబీఐ కోర్టు లో శుక్రవారం విచారణ జరిగింది.

విచారణ సందర్భంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీం కోర్టు మార్చినట్లు సీబీఐ కోర్టుకు సీబీఐ ప్రత్యేక పీపీ తెలిపారు. సీబీఐ స్పెషల్ పీపీకి సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వైఎస్ వివేకా కుమార్తె సునీతా రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను సీబీఐ కోర్టు వచ్చే నెల 28కి వాయిదా వేసింది.వివేకానంద హత్య కేసు తెలంగాణ కు బదిలీ అయిన తరువాత మూడోసారి సీబీఐ కోర్టులో విచారణ కొనసాగుతోంది. వివేకా హత్యకు సంబంధించి ట్రయల్స్ కొనసాగుతున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఐదు మంది నిందితులు కోర్టుకు హాజరవ్వాలంటూ గత విచారణలో కోర్టు చెప్పింది. అయితే ఈరోజు కేవలం నలుగురు నిందితులు మాత్రమే కోర్టు ముందు హాజరయ్యారు.

ఈ కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఈరోజు విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోతున్నాని, ఖచ్చితంగా విచారణకు హాజకారుకావాల్సిన రోజు మాత్రమే తనను విచారణకు పిలవాలంటూ దస్తగిరి ఓ విజ్ఞప్తిని కోర్టుముందు ఉంచారు. మరోవైపు సీబీఐ నుంచి కూడా వాదనలు వినిపించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని సుప్రీం కోర్టు మార్చింది. కొత్త అధికారులను నియమించడంతో పాటు ఈ కేసును వచ్చే 30న పూర్తిస్థాయిలో విచారణను పూర్తి చేయాలని సుప్రీం డెడ్‌లైన్ విధించింది.అయితే ఈ కేసులో తమ వాదనలు కూడా వినాలంటూ సునీతారెడ్డి తరపు న్యాయవాది కోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్స్ జరుగుతున్న దశలో తమ వాదనలు కూడా పరిగణలోకి తీసుకోవాలని సునీతారెడ్డి తన విజ్ఞప్తిని కోర్టు ముందు ఉంచారు.

సునీత పిటిషన్‌ను కోర్టు స్వీకరించడంతో.. తదుపరి విచారణలో సునీత తమ వాదనలు వినిపించే అవకాశం ఉంది. అవసరం అనుకుంటే సీబీఐ పీపీకి సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ వద్ద ఉన్న సమాచారాంతో పాటు ఆధారాలను సీబీఐ పీపీకి అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సునీతారెడ్డి తన ఇంప్లీడ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణ వచ్చేనెల 28కి వాయిదా పడిన నేపథ్యంలో ఐదుగురు నిందితులు కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంటుంది. దాంతో పాటు సునీత వేసిన ఇంప్లీడ్ ఫిటిషన్‌పై కూడా వాదనలు కొనసాగుతాయి. నెల రోజులపాటు జరిగే విచారణను సీబీఐ కోర్టు ముందు ఉంచే అవకాశాలు కనిపిస్తున్నారు.

# కరీముల్లాహ్ షాహ్ మహానియుడి స్ఫూర్తితోనే కరీంనగర్ శాంతియుతంగా ఉంది

## –ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని చాదర్ సమర్పించిన గులాం అహ్మద్ హుస్సేన్



కరీంనగర్, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని సుప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ కరీముల్లాహ్ షాహ్ రహ్మాతుల్లాహ్ అలైహి వార్షిక ఉర్సు ఉత్సావాల సందర్భంగా పాత బజార్, అహ్మద్ పుర లోని కరీముల్లాహ్ షాహ్ సాహబ్ దర్గాహ్ ను ఎంఐఎం నగర అధ్యక్షుడు తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ గురువారం రాత్రి సందర్శించి..చాదర్ సమర్పించి.. ఫాతెహా, దుఆ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీముల్లాహ్ షాహ్ రహ్మాతుల్లాహ్ అలైహి పేరు మీద ఏర్పడిన కరీంనగర్ నేటికీ శాంతియుతంగా ఉందంటే, గంగా జమున తెహజీబ్ కు ప్రతి రూపకంగా హిందూ, ముస్లిం భాయి భాయి గా ఆదర్శంగా ఉన్నారంటే ఆ మహనీయుడి ప్రార్థనల పుణ్య ఫలమేనన్నారు. కరీముల్లాహ్ షాహ్ దర్గాహ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించిన మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బోయినిపల్లి వినోద్ కుమార్ లకు గులాం అహ్మద్ హుస్సేన్ ధన్యవాదాలు తెలిపారు. నగర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, సీఎం కేసీఆర్ ల సేవలు దేశ వ్యాప్తంగా విస్తరించాలని, అంతరించిపోయిన దేశ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడేందుకు కేసీఆర్, అసదుద్దీన్ ఒవైసీ లను దేశ ప్రజలు ఆదరించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా దర్గాహ్ ముతవల్లి సులేమాన్ మన్సూర్ తవక్కలి గులాం అహ్మద్ తో పాటు కార్పొరేటర్లు, నాయకులకు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖీల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, ఎంఐఎం డివిజన్ అధ్యక్షులు సాజిద్, ఫర్హాజ్ అలీ, కరీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతిని గ్రామ గ్రామాన నిర్వహించాలి: దమళ్ళ సత్యం

ఖమ్మం,మార్చి 31: (నేటి నిజం ప్రతినిధి): డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో స్థానిక కల్లూరులో కరపత్రాలు రిలీజ్ చేసిన అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దామల సత్యం,యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ జాదవ్, బీఎస్పీ నాయకులు వెంకట్, సుధీర్, అర్జున్ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొని దామల సత్యం మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న క్రమంలో శుక్రవారం కల్లూరు మండలంలో కరపత్రాలను విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు ఇంకా భారత రాజ్యాంగం ప్రకారం అందవలసిన ప్రతి ఫలాలు అందకుండా ఇప్పుడున్న పాలకులు రాజ్యమేలుతున్నారు. కాబట్టి పూలే అంబేద్కర్ కాన్షిరాముల స్ఫూర్తితో గడపగడపకు భారత రాజ్యాంగాన్ని ఏనుగు గుర్తును బాబాసాహెబ్ అంబేద్కర్ ను పూలే కాన్షీరామ్ లను పరిచయం చేస్తూ ప్రచారం చేయాలని రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని ప్రతి పౌరుడు విద్యార్థి యువత మేలుకోవాలని ఏప్రిల్ 14 ను బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయల సుధీర్, బొల్లె పోగు వెంకట్, తెల్లూరి అర్జున్ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్ శిక్షణతో ఎంతో మందికి పునర్జన్మను ఇవ్వవచ్చు

## –జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు



రాజన్న సిరిసిల్ల, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీ వీ ఆర్)పై విస్తృత అవగాహన పెంపొందించుకోవడం ద్వారా నిండు ప్రాణాలను కాపాడవచ్చునని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు అన్నారు. శుక్రవారం లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ, సమాచార,పౌర సంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలోకార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) పై ×సిరిసిల్ల ప్రెస్ క్లబ్× లో జిల్లాలో నీ జర్నలిస్ట్ లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు సీపీఆర్ చేయు విధానం పై జర్నలిస్ట్ లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు మాట్లాడుతూ..జీవనశైలి మారడం, ఒత్తిడి తో కూడిన జీవితం వల్ల గతంలో కంటే గుండెపోట్లు పెరిగాయన్నారు. గుండె పోటు వచ్చినప్పుడు ఏం చేయాలో అవగాహన లేకపోవడం వల్ల గుండె పోటు కు గురైన వారి లో ఎక్కువ మంది చనిపోతున్నారని అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్ని దానాలలో కెల్లా ప్రాణదానం మిన్న అని భావించి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులతో సహా ఇతర ఫ్రంట్ లైన్ ప్రభుత్వ శాఖల సిబ్బందికి, జర్నలిస్ట్ లకు సీపీఆర్పై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.లైఫ్ సేవింగ్ టెక్నిక్ ల ద్వారా అకస్మాత్తుగా కార్డియాక్ గురయ్యే వారి ప్రాణాలను కాపాడుతూ వారి కుటుంబాలకు వెన్నుదన్నుల నిలవాలని డి ఎం హెచ్ ఓ సూచించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం మాట్లాడుతూ...ప్రజల యొక్క విలువైన ప్రాణాలను కాపాడటమే సీపీఆర్ లక్ష్యం అన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి లైఫ్ స్టైల్ ,ఆహారపు అలవాట్లు మారిపోవడం వల్ల, పని ఒత్తిడి కారణంగా షాక్స్ వస్తున్నాయన్నారు. కరోనా తర్వాత కూడా కార్డియాక్ కేసులు పెరిగాయన్నారు.జర్నలిస్ట్ లు పని ఒత్తిడి తో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్య రక్షణ కోసం లైఫ్ స్టైల్ను మార్చుకోవాలన్నారు. ప్రసార, ప్రింట్ మాధ్యమాల ద్వారా ప్రజలకు సిపిఆర్ ప్రాధాన్యత నుతెలియజెప్పాలన్నారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆకుల జయంత్ కుమార్ మాట్లాడుతూఅకస్మాత్తుగా గుండె ఆగిన సమయంలో బాధితుల ప్రాణాలు రక్షించేందుకు ఉపయోగపడే సీపీఆర్ శిక్షణ పట్ల జర్నలిస్ట్ లకు తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు.కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు టివి నారాయణ, మచ్చ ఆనంద్, ముత్యం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దాడిలో గాయపడిన మెగిలి శ్రీనును పరామర్శించిన మల్లిబాబు యాదవ్



ఖమ్మం,మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): పండితాపురం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా రామాలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవం అనంతరం జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులపై దాదాపు 50 మంది దుండగులు ఉద్దేశపూర్వకంగా రాళ్లతో దాడి చేయడం వలన ఊరేగింపులో పాల్గొన్న వ్యక్తులకు గాయాలయ్యాయి.తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్న మొగిలి శ్రీను ను డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా మైనారిటీ నాయకులు షేక్ ఫతే మహమ్మద్ లు పరామర్శించి మేమున్నామంటూ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ..సామరస్యంగా శాంతియుతంగా జరుగుతున్న శోభాయాత్ర కార్యక్రమంను చూసి ఓర్వలేని కొంతమంది దుండగులు ఊరేగింపును చెదరగొట్టాలని వృద్ధులు మహిళలని చూడకుండా రాళ్లతో దాడి చేసి గాయపరచడం వారి దుర్మార్గపు చర్యకు పరాకాష్ట అని దీనిపై పోలీసులు స్పందించి తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని ఎస్టి అట్రాసిటీ యాక్ట్ క్రింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామంలో శాంతియుతంగా ఉండాలని గ్రామ ప్రజల్ని మల్లిబాబు యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో చల్ల నాగరాజు, బాధావత్ నాగరాజు, భూక్యా రవి, దేరంగుల తిరపయ్య, తురక బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి అందజేత



రాజన్న సిరిసిల్ల, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జరగబోయే పరీక్షల దృష్ట్యా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించుటకు ఫౌండేషన్ ద్వారా పరీక్ష సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు. పిల్లలను ఉత్తేజ పరచడానికి చేస్తున్న విలువైన సూచనలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువ ఫౌండేషన్ ను ప్రశంసించారు.

అనంతరంఅని ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పరీక్షలు బాగా రాసి, 10జిపిఈ మార్కులు తెచ్చుకోవాలని, తమ కుటుంబానికి, పాఠశాలకి మంచి పేరు తేవాలని, భవిష్యత్ లో ఉన్నత స్థితిలో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అవునూరి వెంకటేష్, నేదూరి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో మరో వైద్య విద్యార్థి ఆత్మహత్య

వరంగల్ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); వరంగల్ నగరంలో వైద్య విద్యార్థిని ప్రీతి మృతి చెందిన ఘటన తర్వాత వరుసగా వైద్య విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న కలకలం రేపుతున్నాయి. ఇటీవల నిజామాబాద్ మెడికల్ కాలేజీలో హర్ష అనే వైద్య విద్యార్థి సూసైడ్ తీవ్ర విషాదం నింపగా.. అతడు మరణించిన నెలరోజులకే తాజాగా మరో వైద్య విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపుతోంది.నిజామాబాద్ మెడికల్ కాలేజీలో మరో వైద్య విద్యార్థి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడడం విషాదం నింపింది. ఇది అందరినీ శోకసంద్రంలో నింపింది.గత నెల అదే హాస్టల్ గదిలో హర్ష అనే వైద్య విద్యార్థి మృతిచెందగా.. మళ్లీ అదే గదిలో సనత్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.నిజామాబాద్ మెడికల్ కాలేజీలో విద్యార్థి సనత్ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలోని బాయ్స్ హాస్టల్ మూడో అంతస్తులోని 318 నంబర్ గల రూంలో బెడ్ షీట్ లో ఈ తెల్లవారుజామున ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రేపటి నుంచే పరీక్షలు జరగాల్సిన తరుణంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపింది.వైద్య విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న నిజామాబాద్ 1వ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన విద్యార్థిగా గుర్తించారు. చదువుల ఒత్తిడి వల్లనే విద్యార్థి సనత్ ఆత్మహత్యకు పాల్పడినటట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సెల్ ఫోన్ చాటింగ్ తో విద్యార్థి మృతికి గల కారణాలను పోలీసులు గుర్తిస్తున్నారు.

# ఏపిలో ముందస్తు ఎన్నికలు ?

విజయవాడ మార్చ్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ . ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి ఢిల్లీ దాకా వరస టూర్లు చేయడం హడావుడి పడడం ఎమ్మెల్యేలను మంత్రులను అలెర్ట్ చేయడం వంటివి చూసినపుడు కచ్చితంగా ఏదో తెర వెనక జరుగుతోంది అని అంటున్న వారే ఎక్కువగా ఉన్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ అయితే ఎన్నడూ లేని విధంగా గత రెండు వారాలలో రెండు సార్లు ఢిల్లీ టూర్లు పెట్టుకుని వచ్చారు. ఈ రెండు సార్ల టూర్లలో బయటకు వినిపించినవి కొన్ని అయితే లోపల జరిగేది మరికొన్ని అని అంటున్నారు. పెండింగ్ బిల్స్ ఏపీకి సంబంధించి కేంద్రం నుంచి రావాల్సినవి తెచ్చుకోవడానికి ముఖ్యమంత్రి ఈ టూర్లు చేస్తున్నారని వైసీపీ తరఫున చెబుతున్నారు.అలాగే పోలవరం ప్రాజెక్ట్ సహా కీలక ప్రాజెక్టులకు ఏర్పడిన అడ్డంకులను క్లియర్ చేసుకోవడం వంటివి ఉన్నాయని అంటున్నారు. ఈ విషయాలు కూడా కరెక్టే అని అంటున్నారు. ఏపీకి రావాల్సిన బకాయిలు అలాగే న్యాయంగా కేంద్ర ముంచి రావాల్సిన వాటా విభజన హామీల అమలు మీద సీఎం కేంద్ర పెద్దలపైన వత్తిడి పెట్టడానికి ఢిల్లీకి వరస టూర్లు చేస్తున్నారు అని అంటున్నారు.దానితో పాటుగానే సీఎం ఢిల్లీకి రాజకీయ పనుల మీద కూడా వెళ్తున్నారని అంటున్నారు. ఏపీలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎవరేంటో జనాలు స్పష్టంగా చెప్పేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక అవకాశం ఇచ్చాయి. వాటిని లిట్మస్ టెస్ట్ గా చూసినా వైసీపీ పట్ల వ్యతిరేకత అయితే జనంలో ఉంది అని అంటున్నారు. దాన్ని లైట్ తీసుకోకూడదు అన్నదే వైసీపీ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు.బయటకు వైసీపీ మంత్రులు ఎమ్మెల్యేలు ఇతర నాయకులు జస్ట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పరిమిత సంఖ్యలో ఓటర్లు అని చెప్పుకున్నా మార్పు ఎక్కడో స్టార్ట్ అయిందన్న సంకేతం అయితే వైసీపీ అధినాయకత్వం బాగానే గుర్తించింది అని అంటున్నారు. ఇంకా పూర్తి స్థాయి లో అయితే వ్యతిరకత ప్రబలలేదని అయితే పూర్తిగా ప్రభుత్వం మీద వ్యతిరేక ప్రభంజనం రేగడానికి ఎక్కువ సమయం కూడా పట్టకపోవచ్చు అని వైసీపీ పెద్దలు కరెక్ట్ గానే ఊహిస్తున్నారు అని తెలుస్తోంది. ఒక్కసారి కనుక వ్యతిరేకత పెరిగితే దాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నది కూడా తెలిసిందే. ప్రస్తుతం విపక్షం ఇంకా ఒక దశలోనే ఆగింది. జనం లోకి పూర్తి స్థాయిలోకి వెళ్ళడంలేది. అదే టైం లో టీడీపీలో లోకేష్ పాదయాత్ర ఇంపాక్ట్ చాలానే ఉంది. ముందు పార్టీ శ్రేణులను ఆయన జాగ్రత్తగా కదిలించగలిగారు అని అంటున్నారు.

# క్షేత్ర స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం కోసమే "రాణా దివస్"

## –జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## –ఏప్రిల్ 4న వేములవాడ రూరల్ పీఎస్ లో "రాణా దివస్" ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): క్షేత్ర స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం, కోసమే "రాణా దివస్" రాణా దివస్" అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ప్రకటన జారీ చేశారు.

శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖ కీలకంగా వ్యవహరిస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని, ప్రజల నుండి స్వయంగా విన్నపాలు స్వీకరించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం కోసం తగిన చర్యలు చేపడుతామని అన్నారు. మొదటగా ఏప్రిల్ నెల 4వ తేదీన వేములవాడ రూరల్ మండల పోలీస్ స్టేషన్ లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని, వేములవాడ రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలు, ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఉదయం 10.30 గంటల నుండి అందుబాటులో ఉంటానని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

# కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి-ఎమ్మెల్యే రమేష్ బాబు



రాజన్న సిరిసిల్ల, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): వార్డులో శుక్రవారంకంటి వెలుగు కార్యక్రమాన్ని శాసనసభ్యులు రమేష్ బాబుప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 28 వార్డులో దాదాపు 14 వేల మందికి పరీక్షలు చేసి, మూడో వంతు శాతం మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందన్నారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి శస్త్ర చికిత్స అవసరం అయితే వంద పడకల ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కంటి వెలుగులో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి అధికారులకు అభినందనలు తెలియజేశారు. రానున్న కాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకునే నిరుపేద రోగులకు వారికి బస్సు సౌకర్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పేదల వైద్యం గురించి చిత్తశుద్ధితో ఆలోచిస్తున్నదని అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. వచ్చే మాసంలో వేములవాడ పట్టణంలో 12 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన విధివిధానాలు రూపొందిస్తున్నారని అన్నారు. త్వరలోనే నిరుపేదలకు సొంతింటి కల సాకారం కానున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థం మాధవి, కౌన్సిలర్లు నరాల శేఖర్, యాచమనేని శ్రీనివాస్, జడల లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాద్షా మసాలా ప్రచారంలో కొత్త జింగిల్




హైదరాబాద్, మార్చి 31: ప్రఖ్యాత బాద్షా మసాలా ప్రచారం కోసం సరికొత్త జింగిల్ ను ఆవిష్కరించారు. స్వాద్ సుగంధ్ కా రాజా పేరిట రూపొందిన ఈ జింగిల్ తమ ఉత్పత్తుల ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళుతుందని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రెహాన్ హసన్ పేర్కొన్నారు. ఘన చరిత్ర కలిగిన బాద్షా మసాలాను గతేడాది హిమాలయా సంస్థ సొంతం చేసుకుందని, బాద్షా ఉత్పత్తులను గణనీయంగా విస్తరించి, భారతీయులందరికీ బాద్షా మసాలాను చేరువ చేస్తోందని తెలిపారు. బాద్షా మసాలా ప్రచారంలో తొలినాళ్ల నుంచి జింగిల్స్ భాగంగా ఉన్నాయన్న హసన్.. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ రూపొందించబడిన కొత్త జింగిల్ ప్రజలను ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పాకశాస్త్రంలో భారతదేశం యొక్క ప్రత్యేకతను కొత్త జింగిల్ ప్రతిబింబిస్తూ, ప్రసార మాధ్యమాల ద్వారా బాద్షాకు ప్రజలకు చేరువ చేస్తుందని ఆయన వెల్లడించారు. అదనంగా మా వ్యాపారాన్ని వ్యూహాత్మకంగా విస్తరించడమే కాకుండా, అన్ని భవిష్యత్ ఉద్దేశాలు ప్రయోజనాల నమ్ముతున్నాము. రాబోయే సంవత్సరాల్లో ప్రీమియం నాణ్యమైన సుగంధ ద్రవ్యాలు మసాలా మిశ్రమాల గురించి వినియోగదారుల అంచనాలకు అనుగుణంగా జీవించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. గత సంవత్సరం డాబర్ లెగసీ బ్రాండ్‌ను కొనుగోలు చేయడంతో, బాద్షా మసాలా తన ఉత్పత్తుల శ్రేణిని సరిదిద్దింది నాణ్యమైన సుగంధ ద్రవ్యాలు మసాలా మిశ్రమాల వంటి కొత్త ఉత్పత్తులను దాని పోర్ట్‌ఫోలియోకు జోడించింది, "అని హసన్ తెలిపారు.

# ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలి:జిల్లాకలెక్టర్

ఖమ్మం,మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని, దీంతో ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో రహదారి భద్రత కార్యక్రమాలపై డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. కూడళ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. జిల్లాలోని నేషనల్ హైవే పోనూ మిగులు రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. క్రొత్తగా చేపట్టిన హైవే ప్రాజెక్టుల వద్ద హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్వోబి ల క్రింద అందుబాటులో ఉన్న స్థలంలో ఆక్రమణల తొలగింపుచేసి, ఆటోల, టూ వీలర్ల పార్కింగ్ తదితర అవసరాల కొరకు వినియోగించాలన్నారు. ఆర్ అండ్ బి రోడ్లపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల ను అరికట్టాలన్నారు.రోడ్ల కిరువైపులా ఆక్రమణల తొలగింపు చేయాలన్నారు. ఆసుపత్రిలో న్యూరో,ఆర్థోపెడిక్ సర్జన్లు అందుబాటులో ఉంచాలని,ట్రామా కేర్ సిబ్బంది తగినంత ఉండాలని అన్నారు.స్కూల్,కళాశాల పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.సోలార్ బ్లింకర్లు, రోడ్డు భద్రతా సంబంధ పనులు 15 ఏప్రిల్ కల్లా పూర్తి చేయాలన్నారు.పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ..జంక్షన్ల అభివృద్ధిపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టాలన్నారు.ర్యాష్ డ్రైవింగ్,మద్యపానం సేవించి డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. హైవే రహదారుల అభివృద్ధికి నేషనల్ హైవే అధికారులు,ఏసిపిలు జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని అన్నారు.బైక్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి,అదనపు డిసిపి చంద్రబోస్, ఇఇ శ్యామ్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, ఇఇ పీఆర్ కెవికె. శ్రీనివాస్, జిల్లా రవాణాధికారి టి.కిషన్ రావు, నేషనల్ హైవే పిడి దుర్గాప్రసాద్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి భౌతిక కాయానికి ఏనుగు మనోహర్ రెడ్డి నివాళి



రాజన్న సిరిసిల్ల, మార్చి 31: (నేటినిజం ప్రతినిధి): కథలాపూర్ మండలం కలికోట గ్రామ ఎంపీటీసీ గంగం దేవేంద్ర– గంగారెడ్డి తండ్రి గంగం భూమయ్య మరణించగా, వారి భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఇప్పపెల్లి సర్పంచ్ వసంత –నరేందర్ రెడ్డి, కల్లెడ నరేష్, నరెడ్ల భూమా రెడ్డి, గంగారెడ్డి, ఎల్ల రాజ్ కుమార్, గాండ్ల రమేష్, ఆర్మూర్ రాజేష్, బొమ్మ రాజేశం, కాటిపెల్లి అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.